వైభవంగా అమ్మవారి ఊరేగింపు

నేరేడుచర్ల, న్యూస్‌టుడే: పురపాలిక పరిధిలోని విజయదుర్గ ఆలయం నుంచి అమ్మవారి ఊరేగింపు ఆదివారం అంగరంగ వైభవంగా కొనసాగింది. అలంకృత శకటంపై దుర్గమ్మ తల్లి శోభాయమానంగా భక్తులకు కనువిందు చేసింది. ఊరేగింపులో డప్పు, కోలాట బృందాలు సందడి చేశాయి. ప్రధాన కూడలి వద్ద బాణసంచా ప్రధాన ఆకర్షణగా నిల్చింది. బాణసంచాలో నాగుపాము, పూల పందిరి, ఈత చెట్టు వంటి రంగుల కళారూపాలు వీక్షకులను కట్టిపడేశాయి. బాణసంచా, అమ్మవారి ఊరేగింపు కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.


ఊరేగింపులో పాల్గొన్న కళాకారులు, భక్తులు

ఆయుధ పూజ

సూర్యాపేట నేర విభాగం, న్యూస్‌టుడే: విజయదశమిని పురస్కరించుకుని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ సన్ ప్రీత్ సింగ్, అదనపు ఎస్పీ నాగేశ్వర్ రావు ఆదివారం ఆయుధ పూజను నిర్వహించారు. అనంతరం పోలీస్ సిబ్బందికి మిఠాయిలు పంచి పండగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు రవి, నరసింహ, ప్రత్యేక బ్రాంచ్ నర్సింహ, ఆర్ఐ నారాయణ రాజు, ఆర్ఎస్ఐలు సురేశ్, సాయిరాం, తదితరులు పాల్గొన్నారు.


సూర్యాపేట: జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయుధ పూజ చేస్తున్న ఎస్పీ సన్ ప్రీత్ సింగ్, అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు

ఉత్కంఠకు తెర


హుజూర్‌నగర్: మిల్లుల్లో ధాన్యం దిగుమతికి వేచి ఉన్న ట్రాక్టర్లు (పాతచిత్రం)

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే:

మిల్లర్లు తమ డిమాండ్లు తీర్చాలని పట్టుబడుతున్న క్రమంలో.. కోతలు ప్రారంభం కాగానే ధాన్యం తీసుకునేందుకు మిల్లర్లు ముందుకు రాకపోతే పరిస్థితి ఎలా ఉంటుందో అన్న ఆందోళనకు తెర పడింది. ఒక్కసారిగా ధాన్యం మార్కెట్‌లోకి వస్తే పరిస్థితి గందరగోళంగా మారుతుందని అటు అధికారులు, రైతులు కొంతమేర ఆందోళనగా ఉన్నారు. తాజాగా ప్రభుత్వం ధాన్యాన్ని నేరుగా మిల్లులకు కేటాయించకుండా కొనుగోలు కేంద్రాల నుంచి గోదాములకు తరలించాలని నిర్ణయం తీసుకోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

చర్చల దశలో మిల్లర్ల సమస్యలు..

రాష్ట్ర సబ్ కమిటీ ముందు మిల్లర్లు పలు సమస్యలు ఉంచారు. సన్నధాన్యం మిల్లింగ్ చేసినప్పుడు 67 శాతం బియ్యం రావని, 58 శాతం బియ్యం, 9 శాతం నూకలు ఇస్తామని, తేమ శాతం 14 శాతం మార్చాలని అడుగుతున్నారు. 32 రకాల ధాన్యాన్ని సన్న రకాలుగా గుర్తించాలని, మిల్లింగ్ ఛార్జీలు, ధాన్యం నిల్వ చేసిన ఛార్జీలు ఇవ్వాలని పట్టుబడుతున్నారు. ఇవి చర్చల దశలో ఉన్నాయి.

★ వీటిపై నిర్ణయం రావడానికి కొంత సమయం పట్టే అవకాశం ఉండటంతో ప్రభుత్వంపై ఒత్తిడి లేకుండా కొనుగోలు చేసిన ధాన్యం గోదాములలో నిల్వ చేసి చర్చలు ముగిసిన తరువాత మిల్లులకు కేటాయించేందుకు పౌరసరఫరాలశాఖ సిద్ధమవుతోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 4,83,560 మెట్రిక్ టన్నుల సన్న రకాల ధాన్యం, 10,69,029 మెట్రిక్ టన్నుల దొడ్డు రకాల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. దొడ్డు రకాల ధాన్యంతో ఇబ్బంది లేకపోయినా సన్నరకాల ధాన్యాన్ని నిల్వ చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ మేరకు గోదాముల పరిస్థితి ఏమిటన్న విషయంపై అధికారులు దృష్టి సారించారు. ప్రస్తుతం గోదాములో నిల్వ చేసి నిబంధనల ప్రకారం గడువు అయి పోయిన వారిని వెంటనే ఖాళీ చేయించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

గోదాముల పరిస్థితి ఏమిటి?

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని రకాల గోదాములు కలిపి 59 ఉన్నాయి. ఉమ్మడి జిల్లా అధికారులు సెప్టెంబరు రెండో వారంలో రాష్ట్ర అధికారులకు ఇచ్చిన సమాచారం ప్రకారం ఉమ్మడి జిల్లాలో 9,49,359 మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉండగా.. అందులో 6,51,685 మెట్రిక్ టన్నుల మేర గోదాముల్లో నిల్వలు ఉన్నాయి. కేవలం 2,97,674 మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం మాత్రమే ఖాళీగా ఉంది. అధికారులు ఇప్పుడు పాత నిల్వలను ఖాళీ చేయించుకుంటేనే ప్రభుత్వ ఆలోచన ప్రకారం నిల్వ చేసుకునే అవకాశం దొరుకుతుంది. నల్గొండ, యాదాద్రి జిల్లాల్లో అత్యధికంగా గోదాము ఉపయోగంలో ఉన్నందున దాన్ని ఖాళీ చేయించుకునేందుకు అధికారులు కసరత్తు చేయాల్సి ఉంది.

ఉమ్మడి జిల్లాలోని కొనుగోలు కేంద్రాలకు ధాన్యం రాక అంచనాలు ఇలా (మెట్రిక్ టన్నులలో)

జిల్లా	సన్న రకం	దొడ్డు రకం	మొత్తం
నల్గొండ	2,80,000	4,70,000	7,50,000
సూర్యాపేట	1,71,197	1,99,029	3,70,226
యాదాద్రి	32,363	4,00,000	4,32,363

ఉమ్మడి జిల్లాలో గోదాముల వివరాలు, సామర్థ్యం (మెట్రిక్ టన్నుల్లో)

జిల్లా	గోదాముల సంఖ్య	సామర్థ్యం	ఉన్న నిల్వలు	ఖాళీ సామర్థ్యం
నల్గొండ	31	5,35,223	4,55,219	80,014
సూర్యాపేట	15	2,86,136	83,466	2,02,670
యాదాద్రి	13	1,28,000	1,13,000	15,000

నిర్వహణ లేమి.. అనారోగ్యమే మరి



ఈ చిత్రంలో వేలాడదీసిన మాంసాన్ని తింటున్న ప్రాంతం కోదాడ పట్టణంలోనిది. దుకాణదారుడు బయటకు వెళ్లడంతో ఆరుబయట వేలాడదీసిన మాంసంను కుక్క తింటుండగా స్థానికులు వీడియో తీయడంతో స్థానికంగా అది వైరల్ అయింది. ఎవరూ చూడకపోతే అదే మాంసం విక్రయిస్తే ప్రాణాలకే ప్రమాదకరం.

కోదాడ న్యూస్‌టుడే:

ఆదివారం వచ్చిందంటే చాలు ప్రతి ఇంట్లో మాంసం వంటకాలతో వంట గది ఘుమఘుమలాడాల్సిందే. మాంసం ధరలు రోజురోజుకు పెరుగుతున్నా విక్రయాల్లో మాత్రం తేడాలుండట్లేదు. కానీ విక్రయించే చోట శుభ్రత ఉండటం లేదు. విక్రయదారులకు స్థలం లేకపోవడంతో తోపుడు బండ్ల మీదే విక్రయిస్తున్నారు. ఒక్క కోదాడ పట్టణంలోనే ఆదివారం పదుల సంఖ్యలో బండ్ల మీద విక్రయిస్తున్నారు. రహదారి మీద వచ్చిపోయే వాహనాలకు దుమ్ము, ధూళి మాంసంపై పడుతున్నా, ఈగలు వాలుతున్నా పట్టించుకోవడం లేదు.

ప్రత్యేక షెల్టర్లు లేక..

మాంసం విక్రయించేందుకు ప్రత్యేక మార్కెట్ ఏర్పాటు చేయాలని దుకాణాదారులు ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నారు. ప్రత్యేకంగా మార్కెట్ ఉంటే శుభ్రత పాటించవచ్చని, రహదారి మీద ఇబ్బందిగా ఉంటుందని వారు వాపోతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న పురపాలికల్లో మాంసం విక్రయాల కోసం ప్రత్యేక మార్కెట్లు లేక అంతటా ఇదే తరహా విక్రయాలు కొనసాగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

శుభ్రత పాటించకుంటే జరిమానాలు:

యాదగిరి, శానిటరీ ఇన్‌స్పెక్టర్, కోదాడ

మాంసం విక్రయదారులు ఆరుబయట విక్రయించేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి. దుమ్ము, ధూళి పడకుండా కవర్లు ఏర్పాటు చేయాలి. శుభ్రత పాటించకుండా విక్రయిస్తే జరిమానాలు విధిస్తాం. పురపాలిక తరపున విక్రయదారులకు దుకాణాలు ఏర్పాటు చేస్తాం.

గడ్డిపల్లిలో సమీకృత గురుకుల పాఠశాల

గరిడేపల్లి, న్యూస్‌టుడే: గరిడేపల్లి మండలం గడ్డిపల్లిలో సమీకృత గురుకుల పాఠశాల ఏర్పాటుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే స్థల ఎంపిక పూర్తయింది. రాష్ట్ర వ్యాప్తంగా 28 నియోజకవర్గాల పరిధిలో ఈ పాఠశాలలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. అందులో భాగంగా హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో ప్రభుత్వ స్థలం 20 ఎకరాలు అందుబాటులో లేకపోవడంతో గడ్డిపల్లిని ఎంచుకున్నారు. ఇక్కడ 57వ సర్వే నంబరులో 127 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా.. అందులో 50 ఎకరాల మేర వివిధ రూపాలలో పట్టాలున్నట్లు దస్త్రాలు చెబుతున్నాయి. మిగతా 77 ఎకరాలలో పది ఎకరాలు మండల మెగా పల్లె ప్రకృతి వనాలకు కేటాయించారు. మరో 20 ఎకరాలను ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలకు కేటాయిస్తున్నట్లు అధికారులు ప్రతిపాదించారు. ఇక్కడ గుట్టలు ఉన్నప్పటికీ వాటిని ప్రకృతి సౌందర్యంగా తీర్చిదిద్దాలని, ఆహ్లాదకర వాతావరణం సృష్టించాలని ఉన్నతాధికారులు సంకల్పించారు. గ్రామానికి దూరంగా ఉండటంతో దారి బాగు చేయడానికి అధికారులు ముమ్మరంగా కసరత్తు చేస్తున్నారు. మంగళవారం పాఠశాల నిర్మాణానికి శంకుస్థాపన చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే స్థలాన్ని ఆర్డీవో, తహసీల్దారు పరిశీలించి చదును చేయించారు. శంకుస్థాపన కార్యక్రమానికి గడ్డిపల్లి, బొలిశెట్టివారిగూడెం, చినగారకుంటతండా మీదుగా వెళ్లడానికి మార్గం సుగమం చేశారు. అనంతరం గడ్డిపల్లి నుంచి నేరుగా రహదారి నిర్మాణం చేపట్టనున్నారు.


గడ్డిపల్లి శివారులో స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నేటి నుంచి డిగ్రీ, పీజీ కళాశాలల బంద్

నల్గొండ టౌన్, న్యూస్‌టుడే: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నేటి నుంచి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల బంద్ చేపడుతున్నట్లు ఆ కళాశాలల యాజమాన్య సంఘం అధ్యక్షుడు మారం నాగేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గత మూడేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్‌లు విడుదల కాకపోవడంతో నానా అవస్థలు పడుతున్నామని తెలిపారు. కళాశాలల భవనాల అద్దెలు, కరెంట్ బిల్లులు, అధ్యాపకులకు, సిబ్బందికి వేతనాలు చెల్లించలేని దుస్థితిలో ఉన్నామని గుర్తు చేశారు. కళాశాలల బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు.

ఆనవాళ్లు కోల్పోయి.. ప్రమాదకరంగా తయారై

నడిగూడెం, న్యూస్‌టుడే: సాగర్ ఎడమ కాల్వ కట్ట పలు చోట్ల బలహీనంగా మారింది. కాల్వ కట్టను పటిష్ఠం చేయాల్సిన అవసరం ఉందని రైతులు చెబుతున్నారు. గత నెలలో కురిసిన భారీ వర్షాలకు ఎడమ కాల్వలో వరద నీరు, పాలేరు వెనుక జలాల తాకిడికి రెండు చోట్ల ఎడమ కాల్వ కట్టకు గండ్లు పడిన విషయం విదితమే. ఇదే సందర్భంలో నడిగూడెం మండల పరిధిలోని సిరిపురం, చాకిరాల వద్ద ఎడమ కాల్వ కట్ట పైనుంచి నీరు ప్రవహించింది. మునగాల డీప్ కట్ సమీపంలో కాల్వ కట్ట బలహీనంగా ఉంది. ఇలాంటి ప్రాంతాలను గుర్తించి అధికారులు తక్షణం చర్యలు చేపట్టాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. గత పదేళ్ల నుంచి కాల్వ కట్టలకు మరమ్మతు పనులు చేపట్టకపోవడంతో పలు చోట్ల ఆనవాళ్లు కోల్పోయి ప్రమాదకరంగా తయారయ్యాయని ఆరోపిస్తున్నారు. సాగర్ ఎడమ కాల్వకు నీటి ఉద్ధృతి వల్ల మరోసారి గండి పడే ప్రమాదం లేకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని, అవసరమైన చోట్ల కాల్వ కట్ట ఎత్తును పెంచే పనులు చేయాలని కోరుతున్నారు. ఎడమ కాల్వ పరిధిలో మునగాల హెడ్ రెగ్యులేటరీ నుంచి కేఆర్సీపురం వరకు మూడు చోట్ల కాల్వ కట్ట పటిష్ఠం చేయడం, కాల్వ నీరు కట్టలపైకి చేరకుండా డబుల్ రింగ్ వేసే పనులు చేపట్టేందుకు ప్రతిపాదించినట్లు జేఈ సత్యనారాయణ తెలిపారు. ఇటీవల కాల్వ గండి పూడ్చివేత ప్యాకేజీలోనే ఈ పనులు ప్రతిపాదించామని, త్వరలో కాల్వకట్ట పటిష్ఠం చేసే పనులు చేపడతామన్నారు.


సిరిపురం వద్ద కాల్వ కట్ట పైనుంచి పోతున్న వరద నీరు(పాత చిత్రం)

తిరుగు ప్రయాణంలో.. తిప్పలు

పండగ ముగియడంతో ప్రజలు ఆదివారం నుంచే తిరుగు ముఖం పట్టారు. స్వస్థలాల నుంచి పట్టణానికి వెళ్లేందుకు సూర్యాపేట బస్టాండ్‌కు చేరుకున్నారు. సమయానుసారం బస్సులు రాకపోవడంతో ప్రైవేటు వాహనాలను ఆశ్రయించారు. ప్రయాణికులతో సూర్యాపేట హైటెక్ బస్టాండ్, జాతీయ రహదారి కిక్కిరిసిపోవటంతో సందడిగా మారింది. ఇదే అదనుగా ప్రైవేటు వాహనదారులు అధిక మొత్తంలో నగదు వసూలు చేస్తున్నారని ప్రయాణికులు వాపోయారు.

★ ఈ విషయమై ఆర్టీసీ డీఎం సురేందర్‌ను వివరణ కోరగా.. సాధారణ రోజుల కంటే హైదరాబాద్‌కు అదనంగా 32 సర్వీసులను, ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా అధిక బస్సులు నడిపిస్తున్నట్లు 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

- న్యూస్‌టుడే, కుడకుడరోడ్డు(సూర్యాపేట)


ప్రయాణికులతో కిటకిటలాడుతున్న సూర్యాపేట హైటెక్ బస్టాండ్

మంచి ఆలోచనతో ముందుకు సాగాలి: జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట పురపాలిక, న్యూస్‌టుడే: దసరా, బతుకమ్మ పండగలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి అన్నారు. అందరిలో చెడు తొలిగి మంచి ఆలోచనలతో ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు. సూర్యాపేటలోని ఎంపీడీవో కార్యాలయంలో సంతోషిమాత దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక మందిరంలో శనివారం జమ్మి పూజ చేశారు. పాలపిట్ట, జమ్మి చెట్టును రాష్ట్ర చిహ్నాలుగా గుర్తించిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. శమి పూజ చేసి జమ్మి ఆకును బంగారంగా స్వీకరించే గొప్ప సంస్కృతి మనదన్నారు. పర్యాటక అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, పుర అధ్యక్షురాలు అన్నపూర్ణ, భారాస, కాంగ్రెస్ నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.


సూర్యాపేటలో దసరా పండగను ఉద్దేశించి మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

జల సవ్వడి.. జన సందడి



నూతనకల్ మండలం యడవెల్లి గ్రామ ఆవాసం గుండ్లసింగారం ప్రాజెక్ట్ ఆనకట్ట నుంచి జాలువారుతున్న జలపాతాన్ని చూసి ఆనందించడానికి ఆదివారం పర్యాటకుల సందడి పెరిగింది. పాలేరు ఏటికి అడ్డంగా పూర్వం రైతులు స్వచ్ఛందంగా నిర్మించిన ఈ ప్రాజెక్ట్‌లో జూన్ మాసం నుంచి డిసెంబరు వరకు వాగులోకి వచ్చే నీటితో ఆనకట్ట పరవళ్లు తొక్కుతూ జలపాతం పాల ధారలా మెరుస్తూ ఆకట్టుకుంటుంది. దసరా సెలవులు కావడంతో యువతీ యువకులతో పాటు నవదంపతులు కుటుంబ సభ్యులతో కలిసి ఎక్కువగా ఇక్కడకు చేరుకొని రోజంతా ఆనందంగా గడుపుతున్నారు. సూర్యాపేట, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం జిల్లాల నుంచి సందర్శకులు ఎక్కువగా వస్తుండటంతో జలపాతం జన సంద్రంలా మారింది. – న్యూస్‌టుడే, నూతనకల్



యాదాద్రి క్షేత్రానికి భక్తుల తాకిడి

యాదగిరిగుట్ట అర్బన్, న్యూస్‌టుడే: యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రానికి భక్తులు పోటెత్తారు. దసరా రోజు శనివారం రద్దీ నెలకొనగా, ఆదివారం కూడా కొనసాగింది. సెలవులు ముగుస్తున్న నేపథ్యంలో భారీగా తరలివచ్చారు. ఆలయ వీధుల్లో కోలాహలం కనిపించింది. ఏకాదశి సందర్భంగా ఆలయ మహాముఖ మండపంలో యజ్ఞమూర్తులకు లక్ష పుష్పార్చన జరిపారు. దైవ దర్శనానికి రెండు గంటలు వేచి ఉండాల్సి వచ్చింది. శనివారం రూ.27,32,685, ఆదివారం రూ.29,30,290 ఆదాయం సమకూరిందని ఈవో తెలిపారు.

★ యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో విజయ దశమి వేడుకలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన జమ్మి కొమ్మకు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేడుకలో జిల్లా కలెక్టర్ హన్మంత్ కె.జెండగే, అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యమూర్తుల ఆగమనం.. తరలి వచ్చిన భక్తజనం

మఠంపల్లి, న్యూస్‌టుడే: విజయదశమిని పురస్కరించుకుని ముదిరాజుల ఆధ్వర్యంలో మఠంపల్లిలో శనివారం నిర్వహించిన శమీ పూజకు గ్రామస్థులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. అనాదిగా ఇక్కడ జరిగే జమ్మి పూజకు ఓ ప్రత్యేకత ఉంది. స్థానిక కనకదుర్గ, వేణుగోపాలస్వామి ఆలయాల నుంచి మహిషాసురమర్దినిగా అమ్మవారు, సత్యభామ, రుక్మిణీ సమేత శ్రీకృష్ణుడు గ్రామం వెలుపల ఉన్న శమీ పూజాస్థలికి చేరుకుని భక్త జనులకు దర్శనమిస్తారు. ఈ పర్వాలు ఈ సంవత్సరం సైతం యథావిధిగా జరిగాయి. ఉదయం ముదిరాజులు, స్థానికులు నాభిశిల వద్ద ఆయుధ పూజలు చేశారు. అనంతరం ప్రధాన దేవాలయాల నుంచి ఉత్సవ మూర్తులు భక్తుల జయజయధ్వానాలతో కార్యస్థలికి చేరుకున్నారు. వేల సంఖ్యలో వచ్చిన మహిళలు, పురుషులు జమ్మి పత్రాలు తీసుకునేందుకు పోటీపడ్డారు. మట్టపల్లిలోనూ అర్చకుల ఆధ్వర్యంలో శమీ పూజ నిర్వహించారు. ధర్మకర్తలు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో నవీన్ పాల్గొన్నారు.


మట్టపల్లి ఆలయంలో శమీపూజ నిర్వహిస్తోన్న అర్చకులు

చిగురిస్తున్న ఆశలు

◆ రాయితీపై వ్యవసాయ సామగ్రి అందజేయనున్న సర్కారు

ఆలేరు, న్యూస్‌టుడే:

సేద్యం చేయడానికి గతంలో ఎద్దులు, నాగళ్ల అవసరం ఉండేది. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో అన్ని రంగాలలోనూ మార్పులు చోటు చేసుకుంటున్నాయి. వ్యవసాయ రంగంలోనూ ఆధునిక యంత్రాలు, పరికరాల వినియోగం పెరిగింది. సాగులో దున్నడం మొదలు పంటనూర్పిడి వరకు ఆధునిక యంత్రాలు వినియోగిస్తున్నారు. గతంలో వ్యవసాయశాఖ పరంగా రాయితీతో కూడిన వివిధ పథకాలు అమలులో ఉండేవి. రాయితీపై వ్యవసాయ సామగ్రి, యంత్రాలు రైతులకు మంజూరయ్యేవి. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక.. పాలకులు ఈ పథకాలను పక్కన పడేశారు. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ రాయితీ పథకాలను అమలుకు శ్రీకారం చుట్టేందుకు ఉపక్రమించింది. ఈ నేపథ్యంలో సన్న, చిన్నకారు, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.



ఏటా రూ.600 కోట్లు ఖర్చునకు సిద్ధం

వ్యవసాయశాఖ పరంగా ఇప్పటికే రైతు బంధు(రైతు భరోసా), రైతు బీమా పథకాలు అమలవుతున్నాయి. తాజాగా రాయితీతో కూడిన పథకాలు అమలు చేయాలని నిర్ణయించింది. ఇందుకు ఏటా రూ.600 కోట్లు ఖర్చు చేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ప్రకటించారు. ఇందులో ఉమ్మడి నల్గొండ జిల్లాకు ఏటా రూ.60 కోట్లకు పైగా నిధుల కేటాయింపు జరగనుంది. రోటోవేటర్లు, మూడుకాళ్ల నాగళ్లు, ఆఫ్‌కేజీ చక్రాలు, గొర్రు, పిచికారీ యంత్రాలు, బోరు మోటార్లు, టార్పాలిన్లు లాంటివి రాయితీపై అందనున్నాయి.

ఉమ్మడి జిల్లాలో రైతులు, వ్యవసాయ విస్తీర్ణం..

జిల్లా	రైతులు	విస్తీర్ణంలో(ఎకరాల్లో)
నల్గొండ	4,21,278	9,82,192
సూర్యాపేట	3,30,326	7,26,482
యాదాద్రి	1,57,206	6,65,000

తప్పనున్న కొనుగోలు 'భారం'

బహిరంగ మార్కెట్‌లో వ్యాపారులు చెప్పిన ధరలకు పరికరాలు కొనుగోలు చేయాల్సి వస్తోంది. కొన్ని మండలాల్లో గ్రామైక్య సంఘాలకు ప్రభుత్వం వివిధ రకాల సామగ్రి మంజూరు చేసినప్పటికీ ప్రచార లోపం, ఆయా సంఘాల మహిళలకు వాటిపై పట్టు దొరక్కపోవడంతో ఆశించిన ఫలితాలు రావడం లేదు. ఏదేమైనప్పటికీ ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఏటా వేలాది మంది రైతులకు రాయితీపై పరికరాలు అందనున్నాయి.

జయప్రదమైన.. ఆలోచన



చౌటుప్పల్, న్యూస్‌టుడే: మహిళలు మక్కువతో కొనుగోలు చేసి, ఇష్టంగా ధరించే ఖరీదైన చీరలు, రవికల అందం, ఆకర్షణ తగ్గకుండా సంరక్షించడాన్ని స్వయం ఉపాధిగా ఎంచుకున్నారు అంకిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన నల్ల జయప్రద. ఈమె మహిళా స్వయం సహాయక సంఘం అధ్యక్షురాలు. 2002లో గ్రామంలోని పది మంది మహిళలతో కలిసి శ్రీలక్ష్మి-1 పొదుపు సంఘం సభ్యురాలిగా చేరారు. సంఘం సమావేశాల్లో కేవలం పొదుపు చేయడం గురించే కాకుండా మద్యనిషేధం, భావిపౌరుల సంక్షేమం, వనాల పెంపకం, జల సంరక్షణ అంశాలపై చర్చించేవారు. పొదుపు సొమ్మును, బ్యాంకు నుంచి రుణ సహాయాన్ని కలిపి తమ కుటుంబ సంక్షేమానికి, ఆదాయ అభివృద్ధికి వినియోగిస్తున్నారు. సంఘం ఇచ్చిన చైతన్యంతో సొంతంగా ఏదైనా వ్యాపారం ప్రారంభించి స్వయం ఉపాధితోపాటు కొందరికి పని కల్పించాలని ఆలోచించారు.

★ చీరలు, రవికలు, వివిధ రకాల వస్త్రాలను ఆధునిక పద్ధతిలో శుభ్రం చేయడం, కొత్తవాటిలా మెరిసేలా పాలిషింగ్ చేయడం, మరకలను తొలగించడం, డ్రైక్లీనింగ్ లాంటి వస్త్ర సంరక్షణ పనులు చేయడంలో ప్రత్యేకంగా శిక్షణ పొందారు. తన వ్యాపార ఆలోచనను స్థానిక గ్రామీణ వికాస్ బ్యాంకు అధికారులకు వివరించడంతో వారు ప్రోత్సహిస్తూ రూ.4లక్షల రుణాన్ని మంజూరు చేశారు. ఆ డబ్బుతో యంత్రాలను కొనుగోలు చేసి 'శ్రీదత్త శారీ కేర్ సెంటర్'ను చౌటుప్పల్‌లో ప్రారంభించారు. తనతోపాటు మరో మహిళకు ఉపాధి కల్పించారు.

వస్త్రాలు మహిళల గౌరవాన్ని పెంచుతాయి

– నల్ల జయప్రద, శ్రీదత్త శారీ కేర్ సెంటర్ నిర్వాహకురాలు



మహిళలు, పురుషులు తమ గౌరవాన్ని, ఆత్మ విశ్వాసాన్ని పెంచుకునేలా ఆధునికమైన, ఖరీదైన వస్త్రాలను ధరిస్తున్నారు. పెళ్లిళ్లు, పేరంటాలకు విలువైన పట్టు చీరలు, నాణ్యమైన వస్త్రాలను కొనుగోలు చేస్తున్నారు. వాటిని ధరించిన తర్వాత ఆధునిక పద్ధతుల్లో శుభ్రం చేయాల్సి ఉంటుంది. మరకలు పడితే, వాటికున్న వెండి జరి, అలంకరణ రంగు మారి, మాసిపోయినట్టు అవుతుంది. వాటిని కొత్త వాటిలా తయారు చేయకపోతే వన్నె తగ్గుతుంది. ఈ పనులు చేయడం ద్వారా పరోక్షంగా మహిళలకు ఉపయోగపడవచ్చు. ప్రత్యక్షంగా ఉపాధి పొందవచ్చునని ఆలోచించి ఈ సెంటర్‌ను ప్రారంభించాను.


ఉపాధి పొందుతున్నా..

– జె.సంధ్య, బీఎస్సీ పట్టభద్రురాలు, చౌటుప్పల్



బీఎస్సీ చదివా. ఇంటి వద్ద ఖాళీగా ఉండేదాన్ని. కుటుంబానికి ఆసరాగా ఉండేందుకు ఏదైనా ఉద్యోగం చేయాలని అనుకుంటున్న సమయంలో ఈ సెంటర్‌లో సహాయకురాలిగా పని చేసేందుకు అవకాశం దొరికింది. ఇంటి పనులయ్యాక తీరిక సమయంలో ఇక్కడికొస్తున్నా. పని నేర్చుకుంటూ నిర్వాహకురాలికి సహాయ పడుతున్నా. ఇది గౌరవ ప్రదంగా నిర్వహించే స్వయం ఉపాధి. భవిష్యత్తులో ఈ అనుభవం ఉపయోగపడుతుంది.

గడపకో.. ఉద్యోగి..!



మిర్యాలగూడలోని వినోబానగర్

◆ 300 కుటుంబాల్లో 250 మందికి పైగా ఉద్యోగులు

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: ఊరు పుట్టినప్పటి నుంచి ఉన్న ఆ వీధిలో ఒకప్పుడు కూలీలు, తాపీ పని చేసే వారు మాత్రమే ఉండేవారు. పలువురికి వ్యవసాయ భూములున్నప్పటికీ సాగు చేసేందుకు నీటి సదుపాయం లేక కూలి పని చేసుకుని జీవనం సాగించేవారు. అత్యధికులు తాపీ పనిని నమ్ముకొని కుటుంబాలను పోషించుకుంటూ పిల్లలను చదివించేవారు. కాలక్రమంలో వ్యవసాయాన్ని వృద్ధి చేసుకున్నారు. తాపీ కూలీలు.. మేస్త్రీలుగా మారారు. తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించడం మొదలుపెట్టారు. పట్టణంలో స్వాతంత్య్ర సమరయోధుడు వినోబా బావే పేరుతో ఏర్పడిన ప్రస్తుత 36వ వార్డులోని వినోబా నగర్ నేడు విద్యాధికుల కాలనీగా మారింది. 2005 నుంచి ఉన్నత చదువులు చదువుతున్న వారి సంఖ్య పెరగడంతో ఉద్యోగుల సంఖ్య సైతం పెరుగుతూ వస్తోంది. ప్రస్తుతం 300 కుటుంబాలున్న ఆ కాలనీలో 150 మందికి పైగా ప్రభుత్వ ఉద్యోగులు, మరో వంద మందికి పైగా ప్రైవేట్ ఉద్యోగులు ఉన్నారు.

అటు ఉద్యోగం.. ఇటు వ్యవసాయం

ఈ కాలనీకి చెందిన ఇద్దరు పోలీస్ శాఖలో సీఐలుగా, ఇద్దరు ఎస్సైలు, నలుగురు కానిస్టేబుళ్లు, ఆరుగురు హోంగార్డులుగా పనిచేస్తున్నారు. ఐదుగురు డాక్టర్లు, 30 మంది ఉపాధ్యాయులు, పరిశ్రమల శాఖలో ఒకరు, డీసీటీవోలో ఒకరు, వ్యవసాయ శాఖ ఏడీ ఒకరు, విద్యుత్తు ఏడీఈ ఒకరు, నీటి పారుదల శాఖలో ఇద్దరు ఏఈలు, మరో ముగ్గురు ఉద్యోగులు, నర్సులు ఐదుగురు, పంచాయతీ కార్యదర్శులు ఐదుగురు, వివిధ శాఖల్లో సీనియర్, జూనియర్ సహాయకులు పది మంది, అటెండర్లు 20 మంది ఉన్నారు. ప్రైవేట్ కంపెనీల్లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు 20 మంది పనిచేస్తున్నారు. మరో 80 మంది వివిధ హోదాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. మొత్తం 250 మందికి పైగా ఉద్యోగులు ఉండగా.. వీరిలో పలువురు విధుల అనంతరం వ్యవసాయం చేస్తున్నారు.

తాపీ పనిచేస్తూ చదివించారు..

– కోడిరెక్క రవికుమార్, విద్యుత్తు ఏడీఈ, మిర్యాలగూడ



అమ్మానాన్నలు కోడిరెక్క దోర్నీసు, సుక్కమ్మలు. నాన్న తాపీ పని చేస్తూ మమ్మల్ని ఉన్నత చదువులు చదివించారు. ఎంటెక్ పూర్తి చేసి విద్యుత్తు శాఖలో ఏడీఈగా పని చేస్తున్నా. మా పెద్ద చెల్లి రాధ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, చిన్న చెల్లి వినయరాణి హైదరాబాద్‌లో డాక్టర్, తమ్ముడు వినోద్ కెనడాలో దంత వైద్యుడిగా పని చేస్తున్నారు. అమ్మానాన్న చదువు విలువ తెలుసుకుని ఎంతో కష్టపడి మమ్మల్ని చదివించారు.

ఇంటికి ఇద్దరు పట్టభద్రులే

– కోడిరెక్క శైలజ, పంచాయతీ కార్యదర్శి, తక్కెళ్లపాడు, మిర్యాలగూడ మండలం



నాన్న కోడిరెక్క మల్లయ్య తాపీ పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటూనే మాకు ఏ లోటు రాకుండా ఉన్నత చదువులు చదివించారు. ఎం.ఫార్మసీ పూర్తి చేసి 2019 నుంచి పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నాను. సోదరి వసంత పట్టణంలోనే వైద్యురాలు. సోదరుడు నాగేందర్ డీసీటీవోగా పని చేస్తున్నారు. చదువు విలువ తెలుసుకున్న తలిదండ్రులు మేము ఉన్నత చదువులు చదివేలా ప్రోత్సహించారు. మా కాలనీలో ఇంటికి ఇద్దరు పట్టభద్రులు, ఇంటికొక్కరు చొప్పున ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు.

ముత్యాలమ్మ కొడుకు.. ఆణిముత్యమై..!

మిర్యాలగూడ గ్రామీణం, న్యూస్‌టుడే: సమాజంలో నలుగురితో గౌరవం పొంది, ఉన్నతంగా జీవించాలనే లక్ష్యానికి అనుగుణంగా కష్టాలకు ఎదురొడ్డి.. అన్నీ.. తానై పెంచిన అమ్మ కోసం మిర్యాలగూడ మండల పరిధిలోని కొత్తగూడెం గ్రామానికి చెందిన ఓ యువకుడు నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. ప్రభుత్వ, సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లో ఉంటూ.. పాఠశాలలో, కళాశాలలో స్కాలర్‌షిప్‌లతో చదువుకుని జేపీఎస్, కోల్ ఇండియాలో మేనేజర్, ఏఈఈ, ఇటీవల వెలువడిన ఫలితాల్లో అసిస్టెంట్ మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగం సాధించారు ప్రసాద్ మురారి పోలేపల్లి.



తల్లితో ప్రశాంత్ మురారి పోలేపల్లి

★ తన అనుభవాలను ఆయన మాటల్లోనే.. 'ఇద్దరు అక్కలు, అన్నతోపాటు నాలుగో సంతానంగా పుట్టాను. ఊహ రాకముందే నాన్న చనిపోయారు. అమ్మ ముత్యాలమ్మ అన్నీ తానై కష్టపడి కూలీ పనులు చేస్తూ.. మమ్మల్ని పెంచింది. అమ్మ కష్టాలను చూసి సమాజంలో గౌరవించేలా బతకాలని నిర్ణయించుకున్నాను. అందు కోసం ప్రతి వేసవి సెలవుల్లో క్యాటరింగ్ లాంటి పనులు చేసి చదువుకున్నాను. 2017లో బీటెక్ అయిపోయాక సంవత్సరం విరామం తీసుకుని ఎంటెక్‌లో చేరాను. చదువుతూనే పోటీ పరీక్షలకు సిద్ధమయ్యాను. 2018లో జేపీఎస్ తొలి ఉద్యోగం సాధించాను. తరువాత 2021లో కోల్‌ఇండియాలో మేనేజర్‌గా పశ్చిమబెంగాల్‌లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం వచ్చినా.. చేరలేదు. 2024లో ఐ క్యాడ్ ఏఈఈ ఉద్యోగం వచ్చింది. ప్రస్తుతం నాగార్జునసాగర్‌లో ఉద్యోగం చేస్తున్నాను. టీజీపీఎస్సీ ఇటీవల విడుదల చేసిన అసిస్టెంట్ మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగం సాధించాను.'

వైన్స్‌లో రూ.10.84 లక్షలు మాయం

గుర్రంపోడు, న్యూస్‌టుడే: పండగ రోజున గుర్రంపోడులోని ఓ వైన్స్‌లో రూ.10.84 లక్షల నగదు మాయమైంది. ఈ ఘటన తాలుకు దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శనివారం అర్ధరాత్రి 1:30 గంటలకు ఓ ఆగంతకుడు ఆదిత్య వైన్స్ పైకప్పు రేకును తొలగించి దుకాణం లోపలికి చొరబడి నగదు కట్టలను తీసుకుని ఉడాయించాడు. దుకాణం యజమాని పానుగోటి నర్సింహారావు ఆదివారం ఉదయం దుకాణం షట్టరు తెరిచి చూడగా దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు సీఐ ధనుంజయ, ఎస్‌ఐ నారాయణరెడ్డి ఘటనాస్థలాన్ని పరిశీలించి దర్యాప్తు ప్రారంభించారు. సీసీ కెమెరాల్లో రికార్డయిన వీడియో పుటేజీల ఆధారంగా ముఖానికి మాస్కు, నల్లటి బనియను ధరించిన 30 ఏళ్ల యువకుడు ఈ చోరీకి పాల్పడినట్లు స్పష్టమవుతోంది. దుకాణ యజమాని ఫిర్యాదు మేరకు లభించిన ఆధారాలతో పోలీసులు దొంగ ఆచూకీ కనిపెట్టే ప్రయత్నంలో నిమఘ్నమయ్యారు.



అనుమానితుడు రమేష్ బిస్త్

సీసీకెమెరాలో దొంగతనానికి పాల్పడుతున్న నిందితుడు

★ ఇదిలా ఉండగా.. నల్గొండ జిల్లాలోని పలు వైన్స్‌ల్లో జరిగిన దొంతనాల్లో గుర్రంపోడు చోరీనే భారీ ఘటనగా చెబుతున్నారు. కొండమల్లేపల్లి, దేవరకొండ, నల్గొండ తదితర పట్టణాల్లో వైన్స్‌ల్లో దొంగతనాలు జరిగాయని, వాటిల్లో కూడా నల్లటి బనియను ధరించి మాస్కు వేసుకున్న వ్యక్తే దొంగతనానికి పాల్పడినట్లుగా గుర్తించారు. నెల్లూరు జిల్లా కొవ్వూరులో నివాసం ఉంటున్న నేపాలియన్ రమేష్ బిస్త్ నిత్యం పట్టణాల్లో తిరుగుతూ లాడ్జీల్లో ఉండి వైన్స్‌ల్లో దొంగతనాలకు పాల్పడుతున్నట్లుగా పోలీసుల వద్ద ప్రాథమిక సమాచారం ఉంది.

దేవాదాయ భూములను రక్షిస్తాం

భువనగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: దేవాదాయ శాఖకు సంబంధించిన భూములు, ఆక్రమణకు గురైనవి కాపాడుకునేందుకు రికార్డులు సిద్ధం చేయిస్తున్నామని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. నాగిరెడ్డిపల్లిలోని రమణేశ్వరంలో శ్రీచక్రాలయ ప్రారంభానికి విచ్చేసిన సందర్భంగా విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆమె పై విధంగా స్పందించారు. ఆక్రమణకు గురైన దేవాదాయ భూములను స్వాధీనం చేసుకునేందుకు పకడ్బందీ చర్యలు చేపడతామన్నారు. కోర్టులో పెండింగ్ కేసులపై ఆమె మాట్లాడుతూ.. వివాదాలు త్వరగా పరిష్కారమయ్యేలా న్యాయ నిపుణులను నియమించాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. దేవాదాయ భూములను ఆదాయ వనరులుగా మార్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఆలయ భూములు కబ్జా కాకుండా ఉండేందుకు జియో ట్యాగింగ్ చేస్తున్నామని చెప్పారు.



విలేకరులతో మాట్లాడుతున్న కొండా సురేఖ

ద్విచక్రవాహనం ఢీకొని ఒకరి మృతి: మరొకరికి తీవ్ర గాయాలు

వలిగొండ, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో ఒకరు దుర్మరణం చెందగా.. మరొకరికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని ముద్దాపురం మదిర గ్రామం కొడమర్లబావి వద్ద శనివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. ముద్దాపురం అనుబంధ గ్రామం కొడమర్లబావికి చెందిన దూది నర్సిరెడ్డి(52) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. స్వగ్రామంలో రోడ్డు పక్కన మిత్రులకు జమ్మి పెడుతుండగా మోత్కూరుకు చెందిన కూరెళ్ల విష్ణు తన ద్విచక్రవాహనంతో అతి వేగంగా వచ్చి నర్సిరెడ్డిని, గున్నాల రక్షిత్‌రెడ్డిని బలంగా ఢీకొట్టాడు. నర్సిరెడ్డి, రక్షిత్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం హైదరాబాద్ యశోద ఆసుపత్రికి తీసుకెళ్లగా నర్సిరెడ్డి అప్పటికే మృతి చెందగా.. రక్షిత్‌రెడ్డి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి కుమారుడు రాజశేఖర్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై యుగేందర్ ఆదివారం తెలిపారు.



దూది నర్సిరెడ్డి

ముక్క లాగించారు.. చుక్క తాగేశారు..!

నల్గొండ నేరవిభాగం, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలో ఈ నెల 12న జరిగిన దసరా వేడుకలను అన్ని వర్గాల వారు ఘనంగా జరుపుకున్నారు. పండగ శనివారం కావడంతో కొంత మంది మందు, మటన్, చికెన్‌కు వెనకడగు వేసినా.. అంతకు మించి ఆదివారం దసరా వేడుకలు జరుపుకున్నారు. నల్గొండ జిల్లా కేంద్రంలోని గడియారం సెంటర్‌తో పాటు సూర్యాపేట, యాదాద్రి భువనగిరి ప్రధాన కూడళ్లలో రావణదహనం నిర్వహించారు. దసరా ఉత్సవాలను పురస్కరించుకుని పోలీస్ యంత్రాంగం భారీ భద్రతా ఏర్పాట్లు చేసింది.



★ దసరా సందర్భంగా గడిచిన రెండు రోజుల్లో ఉమ్మడి జిల్లాలో రూ.47.13 కోట్ల మద్యం అమ్మకాలు జరిగినట్లు ఆబ్కారీశాఖ లెక్కలు చెబుతున్నాయి. అందులో నల్గొండ సూర్యాపేటలో 33,725 మద్యం కాటన్లు, 41,798 బీరు కాటన్లు అమ్మకాలు జరగగా.. రూ.33.97 కోట్ల ఆదాయం వచ్చింది. యాదాద్రి భువనగిరి మద్యం డిపో నుంచి 11,927 మద్యం కాటన్లు, 14,687 బీరు కాటన్లు అమ్మకాలు జరుగగా.. రూ.12.16 కోట్ల ఆదాయం వచ్చింది.

★ 860 చికెన్ షాపుల్లో సుమారు 2.75 కోట్ల అమ్మకాలు జరిగినట్లు సంఘం నాయకులు చెబుతున్నారు. 550 మటన్ షాపుల్లో రూ.3.50 కోట్లు, చేపలు ఇతర మాంసాహారం రూ.2.65 కోట్లతో పాటు సుమారు రూ.2 కోట్ల వరకు శీతల పానీయాల అమ్మకాలు జరిగినట్లు వ్యాపార సంబంధిత సంఘాల నాయకులు చెబుతున్నారు.



105 మందికి.. 21 మందే

◆ 'మూసీ' కి సిబ్బంది కొరత



నిర్వహణ లేక డిస్ట్రిబ్యూటరీ కాలువలో పెరిగిన కంపచెట్లు, పేరుకుపోయిన ముళ్లపొదలు

కేతేపల్లి, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలో 33 వేల ఎకరాల భూములకు సాగునీరు అందిస్తున్న మూసీ ప్రాజెక్టుని సిబ్బంది కొరత వెంటాడుతోంది. రిజర్వాయర్ డ్యామ్ నిర్వహణ, కుడి, ఎడమ కాలువలు, డిస్ట్రిబ్యూటరీల పర్యవేక్షణ, చిన్నచిన్న మరమ్మతులు తదితరాల కోసం ఇంజినీరింగ్ అధికారులు మొదలుకొని నీటి పారుదలశాఖలోని 21 విభాగాలకు సంబంధించి మొత్తం 105 పోస్టులను అప్పట్లో కేటాయించారు. అందులో ప్రస్తుతం 21 మంది ఉద్యోగులు మాత్రమే పనిచేస్తుండటం గమనార్హం. చివరి ఆయకట్టు భూముల వరకు నీటిని అందించేందుకు 15 మంది లస్కర్లను ఓఅండ్ఎం, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో నియమించారు. ఒక డీఈఈ, నలుగురు ఇంజినీర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఎలక్ట్రీషియన్, లస్కర్లు తదితర 17 మంది ఉద్యోగులు ఉన్నారు.

◆ వాస్తవానికి కుడి, ఎడమ కాలువలో నీరు చివరి ఆయకట్టు వరకు వెళ్లడం, ఎర్త్‌డ్యామ్ నిర్వహణ కోసం 52 మంది లస్కర్లు అవసరమని నీటి పారుదలశాఖ ఉన్నతాధికారులు ప్రాజెక్టు ప్రారంభ కాలంలో పోస్టులను మంజూరు చేశారు. మూసీ కాలువలకు నీరు విడుదల చేసిన సమయంలో డ్యామ్‌పై, కుడి, ఎడమ కాలువలపై పగలు, రాత్రి నిరంతరం పర్యటించే అధికారులు, సిబ్బంది సంఖ్య ఏయేటికాయేడు తగ్గిపోతుండటంతో పర్యవేక్షణ కొరవడుతోంది.

ఖాళీ అయితే భర్తీ లేదు

నీటిపారుదలశాఖ నుంచి మూసీ ప్రాజెక్టుకు కేటాయించిన సిబ్బంది పోస్టు ఖాళీ అయితే భర్తీ కాకుండా మిగిలిపోతుంది. అధికారులు, ఉద్యోగులు ఉద్యోగ విరమణ పొందడం, ఇతర ప్రాంతాలకు బదిలీ అవడం, అనారోగ్య కారణాలతో మృతిచెందడం తదితరాలతో పోస్టులు ఖాళీలు అవుతున్నాయి. డ్యామ్, కుడి, ఎడమ కాలువలకు ఐదుగురు ఇంజినీర్లు అవసరం కాగా దశాబ్దకాలం నుంచి మూడు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇటీవల ప్రభుత్వం భర్తీ చేసిన ఇంజినీర్ ఉద్యోగాల్లో మూసీకి ముగ్గురు వచ్చారు. మూసీకి ఉన్న 21 రకాల క్యాడర్ ఉద్యోగుల్లో ప్రస్తుతం 10 క్యాడర్ ఉద్యోగుల పోస్టులు ఏళ్లతరబడి ఖాళీగా ఉంటున్నాయి.

పొరుగు సేవల పద్ధతిన సిబ్బంది:

– చంద్రశేఖర్, డీఈఈ, మూసీ

మూసీ నీటిని ఆయకట్టుకు విడుదల చేసినందున 15 మంది ఔట్‌సోర్సింగ్ పద్ధతిన లస్కర్లను నియమించి నీటి విడుదల పర్యవేక్షణ చేస్తున్నాం. ఇబ్బందులు రాకుండా ప్రస్తుతం ఉన్న సిబ్బందితో పనులు కొనసాగిస్తున్నాం. రైతులు కూడా సహకరించి నీటి వృథా కాకుండా జాగ్రత్తలు తీసుకుంటే చివరి ఆయకట్టు వరకు నీరు పారేలా సహకరించాలి.

శిథిల భవనాలు.. అపహరణకు గురవుతున్న ఆస్తులు..

మూసీ అధికారులు, సిబ్బంది నివాసం ఉండేందుకు సూర్యాపేట, కేతేపల్లి, మూసీ డ్యామ్ దిగువన, పిల్లలమర్రిలో క్వార్టర్లు నిర్మించారు. వాటిలో ఉండేవారు లేకపోవడం, నిర్వహణ కొరవడటంతో అవి ప్రస్తుతం శిథిలమవుతున్నాయి. సిబ్బంది లేక కాలువలపై పర్యవేక్షణ కొరవడి డిస్ట్రిబ్యూటరీల షట్టర్లు, ఇనుప రాడ్లు, వంతెనల రెయిలింగ్, క్వార్టర్ల తలుపులు, కిటికీలు అపహరణకు గురవుతున్నాయి. రెండున్నర దశాబ్దాల క్రితం మూసీ పర్యాటకానికి తలమానికంగా ఉన్న అతిథి గృహం ఇప్పుడు ఆనవాళ్లు కోల్పోయింది.



సిబ్బంది లేక కేతేపల్లిలో నిరుపయోగంగా ఉన్న క్వార్టర్లు

తరలివచ్చిన జనం.. రావణ దహనం

చౌటుప్పల్‌లో విజయ దశమి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఎదురుగా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన దుర్గాదేవికి పూజలు నిర్వహించి కలశం ఉద్వాసన చేసి టపాసులతో రావణ దహనం, నాగు పాము విన్యాసాలు ప్రదర్శించారు. వీటిని తిలకించేందుకు పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. పుర ఛైర్మన్ వెన్‌రెడ్డి రాజు, సంధ్య దంపతులు, పోలీస్ ఇన్‌స్పెక్టర్ మన్మథ కుమార్, ఆర్యవైశ్య సంఘం మండల, పట్టణ అధ్యక్షులు కాంశెట్టి చంద్రశేఖర్, పాలడుగు వెంకన్న టపాకాయలు కాల్చి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. – న్యూస్‌టుడే, చౌటుప్పల్



పండగ రోజు విషాదం



నాగయ్య

మిర్యాలగూడ గ్రామీణం, న్యూస్‌టుడే: దసరా పండగ సామగ్రి తీసుకుని ఇంటికి వస్తుండగా.. డీజే వాహనం ఢీకొని ఓ వివాహితుడు మృతి చెందగా.. మరొకరికి గాయాలైన ఘటన మండల పరిధిలోని రాయినిపాలెం గ్రామశివారులో శనివారం చోటుచేసుకుంది. గ్రామీణ ఎస్సై పి.లోకేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బూర నాగయ్య(34), బూర సైదులు ఇద్దరు ద్విచక్ర వాహనంపై మిర్యాలగూడ పట్టణానికి వెళ్లి పండగ సామగ్రిని తీసుకుని ఇంటికి తిరిగి వస్తూ గ్రామశివారుకు చేరుకోగానే.. గ్రామం నుంచి ఆలగడప వెళ్తున్న డీజే వాహనం అతివేగంగా వచ్చి వీరిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నాగయ్య, సైదులుకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. వీరిని పరీక్షించిన వైద్యులు నాగయ్య అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. సైదులుకు చికిత్స అందించి.. మెరుగైన వైద్యసేవల కోసం హైదరాబాద్‌కు తరలించారు. నాగయ్య భార్య స్రవంతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మరణోత్తర పరీక్షల అనంతరం నాగయ్య మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. నాగయ్యకు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఇరువర్గాల పరస్పర దాడులు, పలువురిపై కేసులు

చిలుకూరు, న్యూస్‌టుడే: బేతవోలులో శనివారం జరిగిన దసరా ఉత్సవంలో ఘర్షణ చోటుచేసుకుంది. విధుల్లో ఉన్న ఏఎస్సై వెంకటేశ్వర్లుపై దాడి చేయడంతో గ్రామానికి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ వరకుమార్, ఆయన భార్య రాణితో పాటు మరో ముగ్గురిపై ఏఎస్సై ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు కోదాడ గ్రామీణ సీఐ రజితారెడ్డి తెలిపారు.

❑ పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో ఏటా కనక దుర్గమ్మ ఆలయం వద్ద వీర్లదేవి చెరువులో తెప్పోత్సవం నిర్వహిస్తారు. ఈ ఉత్సవాల్లో పాల్గొనేందుకు గ్రామానికి చెందిన తాజా మాజీ సర్పంచి వట్టికూటి చంద్రకళ భర్త నాగయ్యగౌడ్ అక్కడకు వచ్చారు. చెరువు వద్దకు వచ్చిన తరువాత నాగయ్య మూత్ర విసర్జన చేస్తుండగా గ్రామానికి చెందిన వినోద్ చరవాణిలో ఈ దృశ్యాన్ని చిత్రీకరిస్తుండటంతో.. నాగయ్య కుటుంబ సభ్యుల్లో ఒకరైన నరేశ్ అతడిని ప్రశ్నించాడు. దీంతో ఇరువురి మధ్య గొడవ మొదలైంది.

❑ గతంలో జరిగిన పలు ఘటనల నేపథ్యంలో అక్కడే ఉన్న వరకుమార్ కుటుంబ సభ్యులు, నాగయ్య కుటుంబ సభ్యులు ఒకరితో ఒకరు ఘర్షణకు దిగారు. అక్కడే ఉన్న కోదాడ పట్టణ సీఐ రాము, చిలుకూరు ఎస్సై రాంబాబు, ఏఎస్సై వెంకటేశ్వర్లు, పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకు వచ్చి వరకుమార్ వర్గం వారిని దేవాలయంలోకి, మరో వర్గం వారిని దేవాలయం నుంచి దూరంగా పంపించారు. నాగయ్య వర్గానికి చెందిన సభ్యులు దేవాలయ చిన్న గేటు నుంచి లోపలికి వెళ్లడంతో మళ్లీ ఉద్రిక్తత ఏర్పడింది. ఇరువర్గాల వారు రాళ్లు, అక్కడే ఉన్న పైపులు ఒకరిపై ఒకరు విసురుకున్నారు. పరిస్థితి అదుపు తప్పడంతో పోలీసులు లాఠీ ఛార్జ్ చేసి ఇరు వర్గాలను చెదరగొట్టారు. ఘటనలో సీఐ రాము తలకు వెనుక భాగంలో, ఏఎస్సై వెంకటేశ్వర్లుకు కంటి భాగంలో గాయాలయ్యాయి. నాగయ్య వర్గానికి చెందిన పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. ఘటన స్థలానికి కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, పోలీసులు చేరుకొని వరకుమార్‌తో పాటు పలువురిని అదుపులోకి తీసుకొన్నారు. గ్రామంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో సమస్య సద్దు మణిగింది. రాత్రి మొత్తం పోలీసులు గ్రామంలో పికెట్ నిర్వహించారు. ఈ ఘటనపై నాగయ్య సైతం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఫీల్డ్ అసిస్టెంట్ దుర్మరణం



జర్పుల బిచ్యా నాయక్

మర్రిగూడ, న్యూస్‌టుడే: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన నల్గొండ జిల్లా మర్రిగూడ మండల కేంద్రం శివారులో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కొండూరు గ్రామ పంచాయతీ ఆవాస ప్రాంతం తూర్పు తండాకు చెందిన జర్పుల బిచ్యానాయక్ (35) ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. శనివారం తన సొంత పని మీద మండల కేంద్రానికి వచ్చి తిరిగి పయనమయ్యారు. అదే సమయానికి కొండూరు గ్రామానికి చెందిన దుబ్బ శివ అతని బంధువు ద్విచక్ర వాహనంపై మండల కేంద్రానికి వెళ్తున్నారు. దోర్నాల బావి వద్దకు రాగానే రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో బిచ్యా నాయక్‌కు తీవ్రంగా గాయాలు కాగా స్థానికులు గమనించి చికిత్స కోసం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించారు. మృతుడికి ఇద్దరు పిల్లలు, భార్య ఉన్నారు. దసరా పండగ రోజు అందరితో సంతోషంగా గడపాల్సిన సమయంలో చనిపోవడంతో తండాలోని గిరిజనులు అంతా బోరున విలపించారు. గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నామని ఎస్సై రంగారెడ్డి తెలిపారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	126–00
రిటైల్	146–00
డ్రెస్డ్	215–00
స్కిన్‌లెస్	244–00


కోదాడ
•కోదాడ •హుజూర్‌నగర్

చికిత్స జరిపించి.. సాయం అందించి

పాలకవీడు గ్రామీణం, న్యూస్‌టుడే: నిరుపేద కుటుంబానికి చెందిన ఓ బాలుడు చిన్నతనం నుంచే చెవిటి, మూగ వైకల్యంతో బాధపడుతూ ఉండగా అతనికి చికిత్స జరిపించి సాయం చేసి దాతృత్వం చాటిన ఘటన నేరేడుచర్ల పురపాలిక పరిధిలో చోటుచేసుకొంది. పురపాలిక పరిధిలో కార్తీక్ అనే బాలుడు బాల్యం నుంచే వైకల్యానికి గురి కావటంతో అతని తల్లితండ్రులు గురుమూర్తి, కృష్ణవేణి స్థానిక లయన్స్ క్లబ్ సభ్యులు సత్వరం స్పందించి హైదరాబాద్‌లోని రావూస్ ఆసుపత్రి యాజమాన్యంతో మాట్లాడి రూ.18లక్షల విలువైన చికిత్సలను ఉచితంగా జరిపించారు. కార్తీక్‌కు చికిత్స అనంతరం మందులు, ఇతర అవసరాల కోసం రూ.30వేలు సేకరించి ఆదివారం కుటుంబసభ్యులకు అందించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రామస్వామి, ప్రభాకర్ రెడ్డి, సత్యనారాయణరెడ్డి, క్రాంతికుమార్, తదితరులు పాల్గొన్నారు.

రతన్ టాటా సేవలు మరువలేం

కోదాడ, న్యూస్‌టుడే: దేశాభివృద్ధిలో వ్యాపార పరంగా రతన్ టాటా సేవలు మరువలేమని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలో వ్యాపార, వైద్య, విద్యావేత్తలు, ఉద్యోగులు, రాజకీయ


కోదాడలో సంతాపం తెలుపుతున్న విద్య, వైద్య, వ్యాపార, రాజకీయ వేత్తలు

నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన సంతాప సభ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డీసీసీబీ మాజీ ఛైర్మన్ పాండురంగారావు రతన్ సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో వెంకట్రావు, నాగిరెడ్డి, మూర్తి, సుబ్బారావు, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గరిడేపల్లి, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనం అదుపు తప్పి యువకుడు మృతి చెందిన ఘటన రాయినిగూడెం శివారులో చోటు చేసుకుంది. ఎస్సై చలిగంటి నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ మండలం లింగగిరి గ్రామానికి చెందిన తోకల మహేష్(27) ఓ ఫైనాన్స్ కంపెనీలో మార్కెటింగ్ ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. విధుల్లో భాగంగా మునగాల వెళ్లి రాత్రి తిరిగి ఇంటికి వస్తుండగా రాయినిగూడెం గ్రామ శివారులో ద్విచక్రవాహనం అదుపు తప్పి రోడ్డు పక్క పడిపోయింది. కిందపడటంతో తలకు బలమైన గాయాలై కాల్వలో పడి ప్రవాహానికి కొంతదూరం కొట్టుకు పోయి మరణించాడు. కుమారుడి మరణంపై అనుమానం ఉందని తండ్రి దుర్గయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



మహేష్

ద్విచక్రవాహనం అదుపుతప్పి యువకుడికి గాయాలు

హుజూర్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడటంతో యువకుడి తలకు బలమైన గాయాలైన ఘటన వేపలసింగారం-మిట్టగూడెం శివారులోని గ్యాస్ గోదాం వద్ద ఆదివారం చోటు చేసుకుంది. హుజూర్‌నగర్‌కు చెందిన బండ్ల సురేష్‌గోపి మేళ్లచెరువు నుంచి హుజూర్‌నగర్‌కు వస్తుండగా ఘటన జరిగింది. స్థానికులు 108 ద్వారా హుజూర్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం సూర్యాపేట జిల్లా ఆసుపత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించినట్లు బంధువులు తెలిపారు.

రైభస జిల్లా కమిటీ సభ్యుడి కన్నుమూత

పాలకవీడు గ్రామీణం, న్యూస్‌టుడే: నర్లెంగులగూడెం గ్రామానికి మలిమంటి దర్గారావు(65) శుక్రవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. గత భారాస ప్రభుత్వ హయాంలో పాలకవీడు మండల అధ్యక్షుడిగా పనిచేశారు. రైభస జిల్లా కమిటీ సభ్యుడిగా కొనసాగుతూ అన్నదాతలకు అండగా నిల్చి పలు విధాలుగా సాయం అందించారు. పార్టీలకతీతంగా నాయకులు ఆయనకు నివాళి అర్పించి కుటుంబసభ్యులను ఓదార్చారు. మాజీ ఎంపీపీ గోపాల్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సుబ్బారావు, మోతీలాల్, శేషురెడ్డి, భారాస నాయకులు లక్ష్మారెడ్డి, సైదులు, సీపీఐ నాయకులు ధనుంజయనాయుడు, జానయ్య, భాజపా నాయకులు వెంకటేశ్వర్లు, సీపీఎం నాయకులు అనంతప్రకాశ్, మట్టేశ్ తదితరులు పాల్గొన్నారు.


దర్గారావు

అనారోగ్యంతో వైద్యుడి..

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: హుజూర్‌నగర్ అభయ ఆసుపత్రి వైద్యుడు సుదర్శన్‌నాయుడు(53) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. గత కొంతకాలంగా ఆయన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. మిర్యాలగూడ ప్రాంతానికి చెందిన సుదర్శన్‌నాయుడు చాలా కాలంగా హుజూర్‌నగర్‌లో ఆసుపత్రి ఏర్పాటు చేసి వైద్య రంగంలో ఉన్నారు. ఒచి డాక్టర్‌గా పేరు పొందిన ఆయన అనారోగ్య సమస్యలతో మరణించారు. ఆయన మృతి పట్ల డాక్టర్లు, నాయకులు, న్యాయవాదులు నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

ముచ్చటగా మూడు..!

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: హుజూర్‌నగర్ అంబేడ్కర్ కాలనీకి చెందిన బరిగెల నవీన్‌కుమార్ మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి హ్యాట్రిక్ సాధించారు. నిరుపేద కుటుంబానికి చెందిన నవీన్‌కుమార్ చిన్నతనం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుని ప్రతిభకు పదును పెట్టుకున్నారు. తండ్రి బాబూరావు భవన నిర్మాణ రంగంలో పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. చిన్నతనంలో గరిడేపల్లి మండలం గారకుంటతండాలో ఒకటి నుంచి ఐదు వరకు, 6 నుంచి 10 వరకు గరిడేపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్నారు. ఇంటర్, డిగ్రీ పూర్తి కాగానే 2021లో కానిస్టేబుల్ పరీక్ష రాసి ఎంపికయ్యారు. కానిస్టేబుల్‌గా 12వ బెటాలియన్ అన్నెపర్తి, నల్గొండలో విధులు నిర్వహించారు. 2024 సంవత్సరం ఆరంభంలో ఎక్సైజ్ కానిస్టేబుల్ పరీక్ష రాసి దానికి సైతం ఎంపికయ్యారు. కానిస్టేబుల్ ఉద్యోగానికి రాజీనామా చేసి ఎక్సైజ్ కానిస్టేబుల్ ఉద్యోగాన్ని ఎంపిక చేసుకొని హుజూర్‌నగర్‌లో విధులు నిర్వర్తించారు. ప్రస్తుతం ఉపాధ్యాయ డీఎస్సీ రాసి ఎస్‌జీటీగా ఎంపికయ్యారు. ఈనెల 9న హైదరాబాద్‌లో సీఎం చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు.


నవీన్‌కుమార్



ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివా: లక్ష్మణ్, రామాపురం

పదో తరగతి వరకు రామాపురం, నేరేడుచర్ల ప్రభుత్వ పాఠశాలల్లో, ఇంటర్మీడియట్ నేరేడుచర్ల ప్రభుత్వ కళాశాలలో పూర్తి చేశా. డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్(ఇంగ్లీషు) విభాగంలో జిల్లా ఐదో ర్యాంకు సాధించా. తండ్రి రామచంద్రయ్య చనిపోయిన తర్వాత అన్న ప్రోత్సాహంతో ముందుకు వెళ్లా. ప్రైవేటు కళాశాలల్లో అధ్యాపకుడిగా పని చేశా. ఓయూ క్యాంపస్‌లో ఉండి రోజూ గ్రంథాలయానికి వెళ్లి చదివా.



పగలు ఉద్యోగం.. రాత్రి పుస్తకం: తిరుపతయ్య, జానల్‌దిన్న

నాకు నాలుగు నెలల వయసులోనే ఎడమకాలు, కుడి చెయ్యికి పోలియోతో దివ్యాంగుడిగా మారా. ఎడమచేత్తో రాస్తా. నేరేడుచర్ల ఎమ్మార్సీలో 2012 నుంచి కాంట్రాక్టు ఉద్యోగిగా పని చేస్తున్నా. 2017లో పోస్టులు తక్కువగా ఉండటంతో ఉద్యోగం రాలేదు. పగలంతా ఉద్యోగ విధుల్లో ఉండి రాత్రిపూట చదివా. ప్రభుత్వ ఉపాధ్యాయుడు వెంకటరెడ్డి ప్రోత్సాహం, ఆర్థికసాయంతో ఎం.ఏ, బీఈడీ, డీఈడీ, పీజీడీసీఏ, ఎం.ఎల్ఐసీ వంటి కోర్సులు చేశా.



నేరేడుచర్ల, హుజూర్‌నగర్ న్యూస్‌టుడే: ఉపాధ్యాయ నియామకాలకు సంబంధించి నిర్వహించిన పోటీపరీక్ష డీఎస్సీ-2024లో ప్రతిభ చూపి ఉద్యోగ సాధనలో ముందు వరుసలో నిలిచారు. నేరేడుచర్ల పురపాలిక పరిధిలోని రామాపురానికి చెందిన అక్కాచెల్లెళ్లు రేఖ సుజాత స్కూల్ అసిస్టెంట్-తెలుగు, రేఖ శిరీష ఎస్జీటీ ఉద్యోగం సాధించి ఔరా అనిపించారు.



పట్టుదలతో కొలువుల సాధన: రేఖ సుజాత

నా పట్టుదలకి తోడు భర్త శ్రీకాంత్ ప్రోత్సాహం తోడవడంతో పలు కొలువులు సాధించగలిగా. 2010లో ఆర్టీసీలో కండక్టర్‌గా చేరి 2017 వరకు పనిచేశా. 2019 నుంచి 2024 జులై వరకు దాచారంలో పంచాయతీ కార్యదర్శిగా, ఆ తర్వాత కస్తూర్బా పాఠశాలలో సాంఘిక, తెలుగు సీఆర్‌టీగా ఎంపికైనా వాటిలో చేరలేదు. ఇటీవల టీజీటీ జూనియర్ లెక్చరర్‌గా అనంతగిరి గురుకుల పాఠశాలలో ఉద్యోగంలో చేరా. డీఎస్సీ-2024లో స్కూల్ అసిస్టెంట్ తెలుగులో జిల్లా పదో ర్యాంకు వచ్చింది. మహిళలకు ఉన్న ఒక్క పోస్టు నాకే దక్కింది. మేం ముగ్గురం అక్కాచెల్లెళ్లం, ఒక తమ్ముడు. ఒక చెల్లి శ్రీలత ఇప్పటికే ఎస్జీటీగా ఉద్యోగం చేస్తోంది. తమ్ముడు రవి కానిస్టేబుల్, ఇప్పుడు రెండో చెల్లి శిరీష, నేను డీఎస్సీలో ఉపాధ్యాయ పోస్టులు సాధించాం. నలుగురం ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం ఆనందంగా ఉంది.

రెండో ప్రయత్నం..

మూడో ర్యాంకు: రేఖ శిరీష

సీఎం నుంచి ఉపాధ్యాయ ఉద్యోగ నియామకపత్రం అందుకోవడం ఆనందాన్ని కల్గించింది. గత డీఎస్సీలో ఒక్క మార్కు తేడాతో ఉద్యోగం కోల్పోయా. నిరాశకు గురి కాకుండా రెండో ప్రయత్నంలో ఎస్జీటీలో జిల్లా మూడో ర్యాంకు సాధించా. చిన్న పిల్లవాడి బాధ్యతలు చూసుకుంటూనే ఉద్యోగ సాధనకు రోజుకు 12 గంటలు చదివా.

ఆలనా పాలన చూస్తూ ఐదు ఉద్యోగాలు

గరిడేపల్లి: ఓ వైపు పిల్లల ఆలన పాలన చూసుకుంటూ మరోవైపు ఉద్యోగం చేస్తూ పట్టుదలతో చదివి స్కూల్ అసిస్టెంట్ (జీవ శాస్త్రంలో) ఉద్యోగం సంపాదించారు కీతవారి గూడెం గ్రామానికి చెందిన బిట్టు శ్రీవాణి. ఇటీవల ప్రకటించిన డీఎస్సీ ఫలితాలలో స్కూల్ అసిస్టెంట్‌గా ఉద్యోగం పొంది హైదరాబాద్‌లో నియామకపత్రం అందుకున్నారు. భర్త రవి అగ్నిమాపక శాఖలో హెడ్‌కానిస్టేబుల్‌గా పని చేస్తూ శ్రీవాణిని ప్రోత్సహించారు. కోచింగ్ లేకుండా పట్టుదలతో చదివి గతంలో కస్తూర్బాలో, గురుకుల పాఠశాలలో మూడు ఉద్యోగాలు సాధించారు. ప్రస్తుతం చిల్లేపల్లి వద్ద కస్తూర్బాలో టీచర్‌గా చేస్తున్నారు.

అపీ ఇపీ

నివాళి.. హుజూర్‌నగర్ గ్రామీణం: లక్కవరం గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త, రేషన్ డీలర్ బొమ్మగాని శ్రీను(49) శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతదేహానికి మండల డీలర్ల సంఘం నాయకులు ఆదివారం నివాళి అర్పించారు. మాజీ సర్పంచి గురుపాదం, డీలర్ల సంఘం కార్యదర్శి లింగయ్య, మధు, సుబ్బరాజు, తదితరులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్: కాంగ్రెస్ సేవాదళ్ నాయకుడు దాసిరి కోటయ్యకు ఆదివారం పలువురు నాయకులు నివాళులు అర్పించారు. ఆయన 20 వర్ధంతి సందర్భంగా గోవిందపురంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, ఆయన స్మారక స్తూపం వద్ద నివాళులు అర్పించారు. గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు బెంజిమన్, శ్రీనివాస్, సుభాష్, షర్మిల, తదితరులు పాల్గొన్నారు.

అభినందనీయం.. కోదాడ: కోదాడ కోర్టులో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా న్యాయవాది సిలివేరు వెంకటేశ్వర్లు నియమితులవ్వడం అభినందనీయమని కుమ్మరి సంఘం నాయకులు తెలిపారు. సంఘం సభ్యులు ఆదివారం పట్టణంలో ఆయనను సన్మానించారు. నరసింహ, కృష్ణ, రామారావు, అంజయ్య, రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం.. మునగాల: ఇటీవల ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో బయోసైన్స్‌లో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా నియామక పత్రం అందుకున్న గణపవరం గ్రామానికి చెందిన గంధం హరిప్రసాద్‌ను బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణ ఆదివారం సన్మానించారు.

డిమాండ్.. నడిగూడెం: అర్హులైన పేదలకు అన్యాయం జరిగేలా జారీ చేసిన ఇందిరమ్మ కమిటీల ఏర్పాటు జీవోను వెంటనే రద్దు చేయాలని భాజపా నల్గొండ పార్లమెంటరీ కన్వీనర్ వి.శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వెంటనే కమిటీల ఏర్పాటును మానుకుని, గ్రామ సభల ద్వారా అర్హులైన పేదలను గుర్తించాలన్నారు.

అనంతగిరి గుట్టను అభివృద్ధి చేయండి

అనంతగిరి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని అనంతగిరి గుట్టను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని మండలానికి చెందిన కొందరు ఎన్నారైలు మంత్రి జూపల్లి కృష్ణారావును కోరారు. గత పది రోజులుగా అమెరికాలో మంత్రి పర్యటిస్తుండగా ఆదివారం ఎన్నారైలు ఈ సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. స్థానిక ఎమ్మెల్యే, మంత్రి సహకారంతో గుట్టను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తానని మంత్రి తెలిపినట్లు ఎన్నారై జలగం సుధీర్ తెలిపారు.


అమెరికాలో మంత్రి జూపల్లి కృష్ణారావుతో మండల ఎన్నారైలు

సంతోషాన్ని పంచుకొని.. సరదాగా గడిపి

మేళ్లచెరువు, న్యూస్‌టుడే: సరిగ్గా ఇరవై ఏళ్ల కిందట 2004-05లో మేళ్లచెరువు జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన విద్యార్థులంతా ఆదివారం ఇదే పాఠశాల ప్రాంగణంలో కలుసుకున్నారు. ఇన్నేళ్ల తర్వాత ఎదురు పడడంతో ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. సంతోషాన్ని పంచుకున్నారు. ఈ పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో నాటి గురువులను సన్మానించారు. సాయంత్రం వరకు సరదాగా గడిపారు.


మేళ్లచెరువు జడ్పీ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు, నాటి ఉపాధ్యాయులు

పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో పోటీలు..

హుజూర్‌నగర్ గ్రామీణం: లింగగిరిలోని శ్రీవాసవి మాత రైస్‌మిల్‌లో పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1987-1988 పదో తరగతి చదివిన విద్యార్థులు దసర పండగను పురస్కరించుకొని ఆదివారం ఆటల పోటీలు నిర్వహించారు. వ్యాయామ ఉపాధ్యాయులు దేవిశెట్టి రవి, వల్లపుదాసు మైసయ్యల పర్యవేక్షణలో పెండ్యాల నాగరాజు, కుక్కడపు కోటేశ్వరరావు సారథ్యంలో ఇండోర్ 12-12 క్రికెట్ పోటీ జరిగింది. అనంతరం విజేతలకు రైస్ మిల్లు డైరెక్టర్ శ్రీనివాసరావు బహుమతులు అందజేశారు. పూర్వ విద్యార్థులు బోడుప్పల్ మున్సిపల్ కమిషనర్ నాగేంద్రబాబు, మఠంపల్లి నరసింహస్వామి ఆలయ ఛైర్మన్ చెన్నూరు విజయకుమార్, ఆనంద్ కుమార్, రుపేష్, రమేష్, రవీంద్ర, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

నడిగూడెం, న్యూస్‌టుడే: కబడ్డీ యూత్ ఆధ్వర్యంలో నడిగూడెంలో నిర్వహించిన పోటీల్లో నడిగూడెం జట్టు ప్రథమ, శ్రీరంగాపురం జట్టు ద్వితీయ, తెల్లబల్లి జట్టు తృతీయ, బృందావనపురం నాల్గో బహుమతి గెలుచుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విజేతలకు నగదు బహుమతి అందజేశారు. నిర్వాహకులు సాయి కరుణాకర్, వీరేశం, పి.వెంకటరెడ్డి, రమేశ్, పి.శ్రీను, డి.శ్రీకాంత్, కిరణ్ పాల్గొన్నారు.


ప్రథమ బహుమతి గెల్చుకున్న నడిగూడెం జట్టుతో నిర్వాహకులు, దాతలు


నేరేడుచర్ల విజయదుర్గ ఆలయంలో శమీ పూజ


నారాయణపురంలో ఆకట్టుకున్న వేషధారణలు


బూరుగడ్డ: శమీ పూజలో భక్తులు


కోదాడలో జమ్మి ఆకు కోసం ఎగబడుతున్న ప్రజలు


పానుగోడులో..

విజయదశమి వేడుకలు

పాలకవీడు గ్రామీణం, న్యూస్‌టుడే: నేరేడుచర్ల పురపాలిక పరిధిలోని విజయదుర్గ దేవాలయం, శివాలయాల్లో దసరా సందర్భంగా శనివారం శమీ పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై పూజా కార్యక్రమంలో పాల్గొని సంప్రదాయబద్ధంగా అలయ్ బలయ్ నిర్వహించి జమ్మి ఆకులను పెద్దలకు పంచి ఆశీర్వచనాలు పొందారు. కార్యక్రమంలో పుర ఛైర్మన్ ప్రకాశ్, శ్రీధర్, రామ్మోహనరావు, రమణారావు పాల్గొన్నారు.

చిలుకూరు: నారాయణపురం(పాలెఅన్నారం)లో ముదిరాజ్‌లు ఆయుధపూజలో భాగంగా వివిధ వేషధారణలతో గ్రామంలో ప్రదర్శన చేశారు.

హుజూర్‌నగర్ గ్రామీణం: బూరుగడ్డ గ్రామంలో ఆదివరాహ లక్ష్మీనృసింహ వేణుగోపాల స్వామి ఆలయంలో స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు, ఆరాధన, తదితర కార్యక్రమాలు శనివారం జరిగాయి. ఆలయ ఛైర్మన్ గురవయ్య, ధర్మకర్తలు అంజయ్య, హరీష్, కవిత, నర్సింహారావు, కృష్ణప్రసాద్, హనుమంతరావు, ఈవో ఎంపీ లక్ష్మణ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

మునగాల: మండల కేంద్రంలో సాయంత్రం అయ్యప్పస్వామి దేవాలయంలో గ్రామపెద్దలు ఉప్పుల జానకిరెడ్డి, నల్లపాటి శ్రీనివాస్, వెంకటరెడ్డి శమీ పూజ నిర్వహించారు. అనంతరం ప్రజలు పాలపిట్ట దర్శనం చేసుకొన్నారు.

కోదాడ: పట్టణంలోని నయానగర్, పలు ప్రాంతాల్లో జమ్మి ఆకు కోసం భక్తులు పోటీ పడ్డారు. అమ్మవారి విగ్రహాల ముందు జమ్మి ఆకును ఉంచగా, స్థానికులు ఒక్కసారిగా ఎగబడ్డారు. అనంతరం ఒకరి చేతుల్లో మరొకరు ఆకును ఉంచి పండగ శుభాకాంక్షలు తెలిపారు.

మోతె: మండలకేంద్రంలో పోలీసు స్టేషన్‌లో ఆయుధ పూజ నిర్వహించారు. స్థానిక పెద్ద సొరకాయను నరికి వేడుకలు ప్రారంభించారు. ఏటా జరిపే ఆనవాయితీ ప్రకారం బొడ్రాయి వద్ద వేప చెట్టుకు కట్టిన కోర్కెల కుండను ఎస్సై యాదవేందర్‌రెడ్డి తుపాకీతో పేల్చి స్థానికులతో కలిసి దసరా వేడుకల్లో పాలుపంచుకున్నారు. సిరికొండలో శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయ పరిధిలో అర్చకులు నరసింహాచార్యులు జమ్మికి పూజలు నిర్వహించి అనంతరం స్వామివారు పల్లకీలో తిరువీధి, గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు.

నడిగూడెం: సాయిబాబా మందిరంలో బాబా పాదుకల ప్రదర్శన నిర్వహించారు. శ్రీకోదండరామాలయంలో జమ్మి పూజ నిర్వహించారు.

మేళ్లచెరువు: మేళ్లచెరువులోని శ్రీ స్వయంభు శంభులింగేశ్వర, శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో శని, ఆదివారాల్లో శమీ పూజ నిర్వహించారు.

కానుకల పంపిణీ

విజయదశమి పర్వదినాన గ్రామస్థుడొకరు ఊరంతా కానుకలు అందజేసిన అరుదైన సంఘటన మండలంలోని సర్వారం గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మాజీ సర్పంచి మిక్కిలినేని ఇందిర, పురుషోత్తంరావు దంపతుల తనయుడు కిరీటి గ్రామంలోని ప్రతి ఇంటికి దసరా వేళ దుప్పట్లు అందజేశారు. సుమారు 550 కుటుంబాలకు రూ.2లక్షల విలువైన దుప్పట్లు అందజేసి తన సేవాతత్పరతను చాటుకున్నారు. బెంగళూరులో వ్యాపారం నిర్వహించే కిరీటి గతంలోనూ తన స్వగ్రామంలో దసరా పండగకు బట్టలు పంపిణీ చేసినట్లు గ్రామస్థులు పేర్కొన్నారు.

-మోతె, న్యూస్‌టుడే:


కుమారుడు పంపిన దుప్పట్లను సర్వారం గ్రామస్థులకు పంపిణీ చేస్తున్న ఇందిర, పురుషోత్తమరావు దంపతులు


హుజూర్‌నగర్ సాయిబాబా ఆలయం వద్ద


మోతె: సిరికొండలో..


మేళ్లచెరువు శివాలయంలో..


హుజూర్‌నగర్ రామాలయం ఆధ్వర్యంలో...

దుర్గమ్మకు ప్రత్యేక పూజలు


నేరేడుచర్ల శివాలయంలో రాజరాజేశ్వరి దేవి అలంకారంలో పూజలు అందుకొంటున్న అమ్మవారు

నేరేడుచర్ల, న్యూస్‌టుడే: పురపాలిక పరిధిలో కొలువై ఉన్న విజయదుర్గ ఆలయం, శివాలయంలో అమ్మవారు దసరా రోజు రాజరాజేశ్వరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చింది. అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి కోరిన కోర్కెలు తీర్చాలని కనకదుర్గమ్మను వేడుకొన్నారు.

చిలుకూరు: మండలంలోని పలు గ్రామాలలో కనకదుర్గమ్మ విగ్రహాల శోభాయాత్రను ఆలయ కమిటీ సభ్యులు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నవరాత్రులు ముగించుకొని అమ్మవారి ఊరేగింపును భక్తులు ఆటపాటలతో నిర్వహించి, నిమజ్జనం చేశారు.

హుజూర్‌నగర్: ప్రజలు జమ్మి పూజలో పాల్గొన్న అనంతరం రాజరాజేశ్వరి అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకున్నారు.

హుజూర్‌నగర్ గ్రామీణం: అమరవరం గ్రామంలోని శివాలయం వద్ద దేవీశరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహం వద్ద భవాని భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు.


అమరవరంలో పూజలు చేస్తున్న భవాని స్వాములు


చిలుకూరు: శోభాయాత్రలో నృత్యం చేస్తున్న మహిళలు, యువతులు


మునగాల: కొక్కిరేణి గ్రామంలో..


హుజూర్‌నగర్: రాజరాజేశ్వరీ అలంకారంలో అమ్మవారు


జాన్‌పహాడ్‌లో అమ్మవారి ఊరేగింపు


సిరిపురంలో నిమజ్జనానికి తరలుతున్న దుర్గామాత

విగ్రహాల వద్ద వేలం పాటలు

పట్టణంలో దుర్గామాత విగ్రహాల వద్ద అమ్మవారి చీర, లడ్డూ వేలం పాటలు శనివారం రసవత్తరంగా నిర్వహించారు. కేఆర్ఆర్ కాలనీ, నయానగర్, తదితర ప్రాంతాల్లో వేలం పాటలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. జయపాల్ అనే వ్యక్తి లడ్డూను రూ.16 వేలకు, మదన్మోహన్ అనే వ్యక్తి చీరను రూ.20 వేలకు వేలంపాటలో దక్కించుకున్నారు.

-కోదాడ, న్యూస్‌టుడే:


కోదాడలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

సూర్యాపేట

• సూర్యాపేట • తుంగతుర్తి

అమరుల త్యాగాలు మరువలేనివి



డి కొత్తపల్లిలో జెండావిష్కరణ చేస్తున్న మండారి డేవిడ్‌కుమార్

నాగారం, న్యూస్‌టుడే: అమరవీరుల త్యాగాలు మరువలేనివని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మండారి డేవిడ్‌కుమార్ అన్నారు. డి కొత్తపల్లిలో యానాల నేపాల్‌రెడ్డి, దిండిగల్ లింగయ్యల 44వ వర్ధంతిని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. పేదల హక్కుల కోసం చేసిన పోరాటంలో బూటకపు ఎన్‌కౌంటర్‌లో మరణించిన విప్లవ నాయకులకు నివాళులర్పించడం బాధ్యతగా భావించాలన్నారు. అనంతరం వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఏఐకేఎంఎస్ డివిజన్ అధ్యక్షుడు సంపెట కాశయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి నాగయ్య, ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెబోయిన కిరణ్, సుధాకర్‌రెడ్డి, కృష్ణమూర్తి, లింగయ్య, హేమలత తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ సాయిబాబాకు నివాళి

ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: ప్రజాస్వామికవాది, రచయిత ప్రొఫెసర్ ఎన్.సాయిబాబా మృతి ప్రజా ఉద్యమాలకు తీరనిలోటని ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు అన్నారు. ఆదివారం మండలంలోని ఏపూర్‌లో జెన్నూ స్మారక స్తూపం వద్ద సాయిబాబా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయనను బడుగు, బలహీనవర్గాల ప్రజలు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కంచనపల్లి సైదులు, సుధగాని వెంకన్న, కంచనపల్లి శ్రీను, బండి రవి, వీరబోయిన లింగన్న, ఎర్రయ్య, పవన్ తదితరులు పాల్గొన్నారు.



ఏపూర్‌లో సాయిబాబా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నివాళి.. నాగారం: సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ సీనియర్ నాయకుడు రింగు ఎల్లయ్య అనారోగ్యంతో ఆదివారం మృతిచెందారు. ఆ పార్టీ నాయకులు ఎల్లయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మండారి డేవిడ్‌కుమార్, బొడ్డు శంకర్, గంట నాగయ్య, పోలెబోయిన కిరణ్, సంపెట కాశయ్య, యానాల సుధాకర్‌రెడ్డి, కృష్ణమూర్తి తదితరులున్నారు.

సూర్యాపేట పురపాలిక, న్యూస్‌టుడే:

? సూర్యాపేటలోనే చర్చి కంపౌండ్ రోడ్డు మ్యాన్‌హోళ్లు కుంగిపోయాయి. వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. – లింగయ్య, సూర్యాపేట

✔ పరిశీలించి సరి చేయిస్తాం. – శ్రీనివాస్, పుర కమిషనర్, సూర్యాపేట

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM to 1 PM) సూర్యాపేట: 9154395978 తుంగతుర్తి: 80085 74450

భానుపురి, న్యూస్‌టుడే:

? సూర్యాపేటలోని గిరినగర్‌లో ఇళ్లలోని మురుగు రోడ్లపై పారుతుండటంతో దుర్వాసనతోపాటు దోమలు వృద్ధి చెందుతున్నాయి. కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలి. – తేజ, సూర్యాపేట

✔ సిబ్బందితో వెంటనే పూడిక తీయిస్తాం. – సారగండ్ల శ్రీనివాస్, శానిటరి ఇన్‌స్పెక్టర్, సూర్యాపేట

ఫోన్ చేసి.. పరిష్కారం చూపి

☛ ముమ్మరంగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్రమబద్ధీకరణ

సూర్యాపేట పురపాలికలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్రమబద్ధీకరణలో వేగం పుంజుకొంది. కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులకు ఇటీవల ప్రభుత్వం మోక్షం కల్పించడంతో స్థల యజమానులు ఒక్కొక్కరూ కార్యాలయం వైపు కదులుతున్నారు. పుర అధికారులూ దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల జాబితా ప్రకారం చరవాణి సంఖ్యకు ఫోన్ చేసి సమాచారం అందిస్తున్నారు. కార్యాలయానికి వచ్చి పరిష్కరించుకోవాలని సూచిస్తున్నారు. దీంతో స్థల యజమానులు పుర కార్యాలయానికి వెళ్లి పత్రాలను పరిశీలన చేయించుకొని స్థలాలను క్రమబద్ధీకరించుకుంటున్నారు.
– సూర్యాపేట పురపాలిక, న్యూస్‌టుడే:



సూర్యాపేటలో క్షేత్రస్థాయిలో స్థలాన్ని పరిశీలిస్తున్న పుర కమిషనర్ శ్రీనివాస్, పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు

ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ప్రక్రియకు పుర కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. ప్రత్యేక సిబ్బందిని నియమించి దరఖాస్తుదారులకు సమాచారం అందిస్తున్నారు. తర్వాత పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు దరఖాస్తులను పరిశీలించి క్షేత్రస్థాయిలో స్థల పరిశీలనకు వెళ్తున్నారు. తర్వాత స్థలాన్ని క్రమబద్ధీకరిస్తున్నారు.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

– శ్రీనివాస్, పుర కమిషనర్, సూర్యాపేట

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులు పుర కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌కు వచ్చి సంబంధిత పత్రాలను పరిశీలన చేయించుకోవాలి. సరైన ధ్రువపత్రాలు ఉంటే వెంటనే తమ స్థలాన్ని క్రమబద్ధీకరణ చేస్తాం. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

రూ.వెయ్యి చెల్లించిన దరఖాస్తులకు మోక్షం

సూర్యాపేట పురపాలికకు ఎల్ఆర్ఎస్ కింద 35,631 దరఖాస్తులు వచ్చాయి. వీటన్నింటినీ క్రమబద్ధీకరించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఒక్క దరఖాస్తునూ పెండింగ్ ఉంచొద్దని స్పష్టంచేసింది. ఇందుకు పుర అధికారులు గత రెండునెలలుగా సంబంధిత దరఖాస్తును పరిశీలించి స్థల యజమానులకు సమాచారం అందిస్తున్నారు. ఏళ్లుగా ఎదురుచూసిన సమస్యలకు ఎట్టకేలకు మోక్షం కలగటంతో స్థల యజమానులు పుర కార్యాలయానికి పరుగులు పెడుతున్నారు. రూ. 1000 చెల్లించిన ప్రతి దరఖాస్తుకు పుర అధికారులు పరిష్కారం చూపుతున్నారు.

సూర్యాపేట పురపాలికలో..	మొత్తం ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు	అందులో పరిష్కరించినవి	పరిశీలనలో ఉన్నవి:
	35,631	12,392	23,239

కానిస్టేబుల్ హఠాన్మరణం



నాగారం, న్యూస్‌టుడే: మండలంలోని పసునూరులో గుండెపోటుతో పోలీస్ కానిస్టేబుల్ మృతిచెందారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన **చిత్తలూరి హరీశ్(40)** ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లోని అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. దసరా పండగకు సొంత గ్రామమైన పసునూరుకు వచ్చి కుటుంబసభ్యులు, మిత్రులతో కలిసి సంతోషంగా గడిపారు. ఆదివారం ఉదయం ఒక్కసారిగా గుండె దగ్గర నొప్పి వస్తుందని తెలిపారు. వెంటనే ఆసుపత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యలోనే మృతిచెందారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు.

గౌడ యువజన సంఘం ఎన్నిక

నూతనకల్ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని లింగంపల్లిలో ఆదివారం సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ యువజన సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కారింగుల రవీందర్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా మడ్డి శ్రవణ్, ప్రధాన కార్యదర్శిగా పిట్టల ఉదయ్‌గౌడ్, కార్యదర్శిగా ఆకుల మధు, కోశాధికారిగా మండాది సంజీవ్‌గౌడ్, కార్యవర్గ సభ్యులుగా సతీష్, సునీల్ గౌడ్, సాయి, మహేష్ ఎన్నికయ్యారు.



ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

ఆనాటి గురువులతో.. అదే పాఠశాలలో..



గోరెంట్లలో జడ్పీ ఉన్నత పాఠశాలలో..

మద్దిరాల (గ్రామీణం), న్యూస్‌టుడే: మూడు దశాబ్దాల తర్వాత చిన్ననాటి స్నేహితులు ఒక్కచోట కలుసుకున్నారు. నాటి బాల్య స్మృతులను గుర్తుచేసుకున్నారు. ఇందుకు మండలంలోని గోరెంట్ల జడ్పీ ఉన్నత పాఠశాల వేదికైంది. 1989-90లో పదో తరగతి చదివిన విద్యార్థులు వారికి విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలువాలతో అదే పాఠశాలలో ఆదివారం సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. అప్పటి ప్రధానోపాధ్యాయులు రంగారెడ్డి, ఉపాధ్యాయులు కృష్ణారెడ్డి, చారి, పూర్వ విద్యార్థులు లింగయ్య, నాగేశ్వరరావు, వీరన్న, కసన్య, శ్రీనివాస్, మాధవి, లక్ష్మీ, సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

నాగారం: పసునూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో 2002-2003లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించుకున్నారు. అప్పటి పాఠశాల రోజుల్లో గడిపిన తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. మురళి, శ్రీను, రమేశ్, వీరస్వామి, అంజయ్య, నవీన్, కృష్ణ, నర్సయ్య, మారయ్య, కరుణాకర్, రవికుమార్, సతీష్, మాధవి, యాకలక్ష్మి, రాజేశ్వరి, ధనమ్మ తదితరులున్నారు.



పసునూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో..

సంస్కృతి, సంప్రదాయంలో దేశానికి ఆదర్శం



సూర్యాపేట: విందు కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట (తాళ్లగడ్డ), న్యూస్‌టుడే: అన్ని మతాల ప్రధాన పండగలకు కేసీఆర్ ప్రత్యేక నిధులు కేటాయించటంతో ఐక్యతతో వేడుకలు నిర్వహించుకున్నామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. దసరా సందర్భంగా పేట క్యాంపు కార్యాలయంలో ఆదివారం ముస్లిం, క్రైస్తవులకు సామూహిక విందు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయం దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. పదేళ్ల పాలనలో జరిగిన సూర్యాపేట అభివృద్ధి, ప్రశాంత వాతావరణం, పెరిగిన ఐక్యతను గుర్తు చేశారు. ఎవరెన్ని కుట్రలు చేసినా చెక్కుచెదరని ఐక్యత సూర్యాపేట ప్రజలదన్నారు. భవిష్యత్తులోనూ ఇదే ఐక్యతతో ముందుకు సాగుదామన్నారు.



నూతనకల్‌లో దేవినవరాత్రి ఉత్సవ ముగింపు శోభాయాత్రలో బొడ్రాయి యూత్ కమిటీ సభ్యులు



తిరుమలగిరి: దుర్గామాత వేడుకల్లో పాల్గొన్న సుధీర్‌రెడ్డిని సన్మానిస్తున్న నిర్వాహకులు



తిరుమలగిరిలో.. శోభాయాత్రలో పాల్గొన్న ఎస్సై వి.సురేశ్

ముగిసిన దేవినవరాత్రి ఉత్సవాలు

నూతనకల్, న్యూస్‌టుడే: దేవినవరాత్రి ఉత్సవాలను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. నూతనకల్‌లో బొడ్రాయి యూత్ కమిటీ, శ్రీమాత ఫ్రెండ్స్ యూత్ కమిటీ, తాళ్లసింగారంలో దుర్గాభవాని ఫ్రెండ్ సేవా సభ్యులు చేపట్టిన శోభాయాత్ర అందరిని ఆకట్టుకుంది. మహిళలు కోలాటాలు, నృత్యాలు, పురుషుల భజనలతో వీధుల్లో తిరుగుతూ ఊరేగించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

మద్దిరాల: దేవినవరాత్రి ఉత్సవాల ముగింపులో భాగంగా మండలంలోని ఆయా గ్రామాల్లో దుర్గామాత శోభాయాత్ర కనుల పండువగా సాగింది. ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

నూతనకల్ గ్రామీణం: మండలంలోని ఎర్రపహాడ్, మాచనపల్లి, పెదనెమిల, అల్లునూరు, మిర్యాల, లింగంపల్లి గ్రామాల్లో దుర్గామాత శోభాయాత్ర నిర్వహించారు. రామచంద్రయ్య, సత్యనారాయణ, రవి, రాములు, ఆశోక్, సైదులు, మహేష్, మదు, నిర్వాహకులు పాల్గొన్నారు.

సూర్యాపేట సాంస్కృతికం: దేవిశరన్నవరాత్రి ఉత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. పదో రోజు అమ్మవారు శ్రీరాజ రాజేశ్వరి రూపంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అమ్మవారికి విశేష పూజలను నిర్వహించారు. అనంతరం అమ్మవారిని అలంకరించిన చీరలు, గాజులను వేలం పాట నిర్వహించారు. అనంతరం డప్పుచప్పుళ్లతో నృత్యాలు చేసుకుంటూ అమ్మవారిని చెరువులో నిమజ్జనం చేశారు.

తిరుమలగిరి: తిరుమలగిరిలో దుర్గామాత శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. అలంకరించిన వాహనంలో దుర్గామాతను పురవీధుల గుండా ఊరేగించారు. అనంతరం స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు.

తుంగతుర్తి: స్థానికంగా అమ్మవారి మాల ధరించిన వారు తొమ్మిది రోజులపాటు దీక్షను పాటించి పూజలు నిర్వహించారు. ఆదివారం ఇరుముడి కట్టుకొని దీక్ష విరమణకు విజయవాడకు బయలు దేరి వెళ్లారు.

☛ అమ్మవారి చీరల వేలంపాటలో అన్నారంలో ముస్లిం సోదరులు పాల్గొని సొంతం చేసుకున్నారు. శనివారం నిర్వహించిన కార్యక్రమంలో గ్రామానికి చెందిన సిద్దిక్ పాషా, అజాంఅలీలు రూ. 4100 వరకు వేలం పాడి చీరలను పొంది మతసామరస్యాన్ని చాటారు.

ఆత్మకూర్(ఎస్): మండలంలోని కందగట్ల, నెమ్మికల్, ఆత్మకూర్(ఎస్) తదితర గ్రామాలలో ప్రతిష్ఠించిన దుర్గాదేవి విగ్రహాన్ని భక్తులు కోలాట నృత్యాలతో పురవీధుల్లో ఊరేగింపుగా తీసుకెళ్లి సమీప కుంటలు, చెరువుల్లో నిమజ్జనం చేశారు.

అసంపూర్తిగా విభాగిని నిర్మాణం

మండలంలోని నెమ్మికల్ శ్రీదండుమైసమ్మ ఆలయం వద్ద విస్తరించిన సూర్యాపేట-దంతాలపల్లి రహదారిపై డివైడర్(విభాగిని) బోసిపోయి దర్శనమిస్తుంది. మట్టితో నింపి పచ్చని మొక్కలను పెంచాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. సూర్యాపేట నుంచి ఆలయానికి వచ్చే రహదారిపై కొద్దిదూరం మాత్రమే డివైడర్‌లో ఎర్రటి మట్టితో నింపి వదిలేశారు. మిగతా డివైడర్‌లోనూ మట్టితో నింపి రోడ్డు పొడవునా మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచాలని ప్రయాణికులు కోరుతున్నారు. తక్షణమే మట్టితో నింపి పనులను పూర్తి చేస్తామని ఆర్అండ్‌బీ ఏఈ యుగేందర్ తెలిపారు. – న్యూస్‌టుడే, ఆత్మకూర్(ఎస్)



సగం పనులు.. రాకపోకలకు తిప్పలు



సూర్యాపేట పట్టణంలోని 33, 32వ వార్డులో సీసీ రహదారులను పూర్తిస్థాయిలో నిర్మించలేదు. సగం వరకు పూర్తి చేయడంతో మట్టి రోడ్లపై రాకపోకలు సాగించేందుకు కాలనీవాసులు ఇక్కట్లు పడుతున్నారు. 33వ వార్డులో సీసీరోడ్డును ప్రధాన రహదారి వరకు పూర్తి చేయలేదు. దీంతో కాలనీవాసులు ఇక్కడి నుంచి రాకపోకలు సాగించకుండా చుట్టూ తిరిగి రావాల్సిన దుస్థితి నెలకొంది. 32వ వార్డులో కాలనీ ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు సీసీగా మారటం లేదు. ఈ రహదారి పూర్తయితే శ్రీరాంనగర్, మన్నాచర్చి గుండా జాతీయ రహదారికి వెళ్లవచ్చు. 'ఆయా కాలనీలను పరిశీలించి రహదారుల పూర్తికి చర్యలు తీసుకుంటామ'ని పుర కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. – సూర్యాపేట పురపాలిక, న్యూస్‌టుడే

మార్కెట్ దారి.. గుంతలే మరి

సూర్యాపేట పట్టణంలోని విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారి నుంచి అంబేడ్కర్‌నగర్ కాలనీకి వెళ్లే రహదారి గుంతలమయంగా మారింది. జాతీయ రహదారి వద్ద, మూసీ కాల్వ వద్ద అధ్వానంగా మారింది. నాణ్యతగా బీటీగా వేయకపోవడంతో తరచూ గుంతలు పడుతున్నాయి. జాతీయ రహదారి వద్ద ఏర్పడిన గుంతల్లో ఇటీవల కురిసిన వర్షానికి నీరు నిలిచింది. వాహనదారులు ఇక్కడి రాగానే ఒకేసారి ఆగుతున్నారు. దీంతో వెనక నుంచి వచ్చిన వాహనాలు ఢీకొనడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రి సమయంలో గుంత కనిపించక వాహనదారులు అదుపునకు గురై కింద పడుతున్నారు. అంబేడ్కర్‌నగర్ కాలనీతోపాటు వ్యవసాయ మార్కెట్ ఉండటంతో నిత్యం వాహనాల రాకపోకలు అధికంగా ఉంటాయి. 'గుంతలు పూడ్చి ఇబ్బందులు లేకుండా చూస్తామ'ని ఆర్అండ్‌బీ ఏఈ యుగేందర్ పేర్కొన్నారు. – భానుపురి, న్యూస్‌టుడే:



అలయ్ బలయ్ ఇచ్చుకొని.. ఆత్మీయత పంచుకొని



పెన్‌పహాడ్‌లో విజయదశమి పూజల్లో పాల్గొన్న టీపీసీసీ కార్యదర్శి తూముల భుజంగరావు తదితరులు



తిరుమలగిరి పురపాలికలోని తిరుమలహిల్స్‌లో..



నాగారం: పస్తాలలో..



బొల్లంపల్లిలో..

నూతనకల్, న్యూస్‌టుడే: దసరా వేడుకలను ప్రజలు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. నూతనకల్‌లో శ్రీపార్వతి సమేత శంబులింగేశ్వరస్వామి ఆలయ ఆవరణలో ఆలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ చురకంటి చంద్రారెడ్డి, పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ నాగం జయసుధ, ఆలయకమిటీ మాజీ ఛైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. యడవెల్లిలో మాజీ సర్పంచి మద్రు ప్రసాద్‌రావు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించగా.. తుంగతుర్తి మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గాజుల తిరుమలరావు, మాజీ సర్పంచి సోమయ్య, మాజీ ఉప సర్పంచి సైదులు, ప్రభాకర్, నరేష్ పాల్గొన్నారు.

తిరుమలగిరి: మద్దిరాల: మండలాల వ్యాప్తంగా ప్రజలు విజయదశమి వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు. గ్రామస్థులంతా నూతన వస్త్రాలు ధరించి శమి వృక్షానికి, ఆయుధాలకు, వాహనాలకు పూజలు చేశారు. అనంతరం పాలపిట్టను చూసేందుకు గ్రామశివారుల్లోకి వెళ్లారు. జమ్మి ఆకులు ఇచ్చిపుచ్చుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్: మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో విజయదశమి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్థులు ఊరేగింపుగా జమ్మిచెట్టు వద్దకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. టీపీసీసీ కార్యదర్శి తూముల భుజంగరావు, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు రంగినేని లక్ష్మీకాంతారావు, తూముల ఇంద్రసేనారావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సురేష్‌రావు, సునీల్‌రావు, రాంబాబు గౌడ్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్(ఎస్): మండల వ్యాప్తంగా దసరా వేడుకలను శని, ఆదివారం రెండురోజులపాటు ఘనంగా జరుపుకొన్నారు. మండల కేంద్రం, ఏపూర్, నెమ్మికల్, తుమ్మలపెన్‌పహాడ్, కందగట్ల, పాతర్లపహాడ్ తదితర గ్రామాల ప్రజలు దుర్గామాత ఆలయాల వద్ద పూజలు నిర్వహించారు. తమ కోర్కెలను కాగితాలపై రాసి జమ్మి చెట్టుపై ఉంచారు. పాలపిట్టను చూసి తరించారు. నెమ్మికల్ శ్రీదండుమైసమ్మ ఆలయం రెండు రోజులపాటు భక్తులతో కిటకిటలాడింది. రద్దీ ఏర్పడి ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి.

నూతనకల్ గ్రామీణం: మండలంలోని పెదనెమిల, ఎర్రపహాడ్, బిక్కుమల్ల, దిర్శనపల్లి, మిర్యాల, లింగంపల్లి, మాచనపల్లి గ్రామాల్లో దసరా పండగను ఘనంగా నిర్వహించారు. పెదనెమిల, లింగంపల్లి గ్రామాల్లో ఆయుధ పూజలు చేశారు.

తుంగతుర్తి: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ వద్ద దసరా వేడుకను నిర్వహించారు. అనంతరం రామాలయం వద్ద జమ్మి చెట్టుకు పూజలు జరిపి జమ్మి పత్రిని తీసుకొని ఒకరికొకరు పంచుకొని శుభాకాంక్షలు తెలియజేశారు. సంకినేని రవీందర్‌రావు, వరుణ్‌రావు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, అర్చకస్వామి కాటూరి రామాచార్యులు పాల్గొన్నారు.

తుంగతుర్తి గ్రామీణం: మండలంలోని అన్ని గ్రామాల్లో దసరా వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. అనంతరం జమ్మిచెట్టుకు పూజలు చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

నాగారం: మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో శనివారం దసరా పండగను ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు.

జాజిరెడ్డిగూడెం: మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలలో దసరా పండుగను ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. దేవాలయాల్లో జమ్మి చెట్టుకు పూజలు చేశారు.



ఆత్మకూరు(ఎస్): దసరా సందర్భంగా నెమ్మికల్ దండుమైసమ్మ ఆలయం వద్ద వాహనాల రద్దీ



పెదనెమిలలో..



వెలుగుపల్లి శివాలయంలో..



నూతనకల్‌లో ఆయుధ పూజలో ఆలయ కమిటీ ఛైర్మన్ చంద్రారెడ్డి, పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ జయసుధ, గిరిధర్‌రెడ్డి



తుంగతుర్తిలో ఇరుముడితో విజయవాడకు బయలు దేరిన భవాని స్వాములు



తుంగతుర్తి: అన్నారంలో చీరల వేలంపాటలో పాల్గొన్న ముస్లిం సోదరులు



ఆత్మకూరు(ఎస్): నెమ్మికల్‌లో దుర్గాదేవి ఊరేగింపులో పాల్గొన్న మహిళలు



సూర్యాపేట: ఊరేగింపుగా నిమజ్జనానికి తీసుకెళ్తున్న భక్తులు